



● గుంటూరు హిందూ కాలేజ్ సెంటర్లో మానవహారం



ఎస్పీ తుషార్ దూడికి వినతిపత్రం అందిస్తున్న జర్నలిస్టులు

కలంపై దాడి.. సిగ్గు..సిగ్గు..

- గుంటూరులో వెల్లువెత్తిన నిరసనలు
- మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం
- హిందూ కళాశాల కూడలిలో మానవహారం
- ఎస్పీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ, నినాదాలు
- విలేకర్లకు ప్రత్యేక రక్షణ చట్టం కావాలని డిమాండ్
- రాప్తాడు, కర్నూలు ఘటనలపై అఖిలపక్ష, జర్నలిస్టు సంఘాల ధ్వజం



● గుంటూరు: హిమని సెంటర్లలో గాంధీజీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న జర్నలిస్టు సంఘాల నాయకులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజా సంఘాలు



● ర్యాలీలో పాల్గొన్న మాజీ మంత్రి ఆనందబాబు, మాజీ ఎమ్మెల్యేలు నరేంద్ర, మస్తాన్‌వలి, కనపర్తి, ప్రభాకర్, శేషయ్య , మన్నవ తదితరులు



● హిందూ కాలేజి సెంటర్‌లో రోడ్డుపై కూర్చుని నిరసన

గుంటూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): 'కలంపై దాడులా సిగ్గుసిగ్గు.. జర్నలిస్టులపై దాడులు హేయం..' అంటూ ప్రభుత్వ తీరుపై గుంటూరు జిల్లా జర్నలిస్టులు, అఖిలపక్ష నేతలు, ప్రజాసంఘాల నాయకులు ధ్వజమెత్తారు. జర్నలిస్టులపై దాడులను నిరసిస్తూ బుధవారం పాత్రికేయ సంఘాలు తలపెట్టిన నిరసన కార్యక్రమంతో గుంటూరు నగరం దద్దరిల్లిపోయింది. వందల మంది విలేకరులు, అఖిలపక్ష నేతలు, కార్యకర్తలు ప్రభుత్వ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా కదంతొక్కారు. దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేశారు. రాప్తాడు 'సిద్ధం' సభలో ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణపైన, కర్నూలు జిల్లాలో ఈనాడు కార్యాలయంపై వైసీపీ మూకల దాడులకు నిరసనగా బుధవారం గుంటూరులో ఏపీయూడబ్ల్యూజే, ఐజేయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి టీడీపీ, కాంగ్రెస్, సీపీఐ, బీజేపీ పార్టీలు మద్దతు తెలియజేశాయి. జిల్లాలోని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతోపాటు అన్ని పార్టీలు, అనుబంధ సంఘాల నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తొలుత గుంటూరు కార్పొరేషన్ కార్యాలయం సమీపంలోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిరసన తెపారు. మహాత్ముడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, దాడులను నిరసిస్తూ వినతిపత్రం అందజేశారు. అనంతరం అక్కడి నుంచి నినాదాలు చేస్తూ హిందూ కాలేజ్ సెంటర్లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. వైసీపీ మూకల దాడిలో తీవ్రంగా గాయపడిన ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాత ఎస్పీ కార్యాలయం వరకు ర్యాలీ చేసి, ఎస్పీ తుషార్‌దూడీకి వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టుల ప్రాణ రక్ష ణకు ప్రత్యేక చ ట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నేతలు మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, చిట్టాబత్తిన చిట్టిబాబు, కనపర్తి శ్రీనివాసరావు, సుఖవాసి శ్రీనివాసరవు, రావిపాటి సాయికృష్ణ, వేములకొండ శ్రీనివాస్, ఫిరోజ్, కార్పొరేటర్లు ఈరంటి బాబు, కొమ్మినేని కోటేశ్వరరావు, మానం శ్రీనివాసరావు, కసుకుర్తి హనుమంతరావు, సోమేపల్లి శివప్రసాద్, మద్దిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, షేక్ ఉస్మాన్, షేక్ బాజీ, బ్రహ్మం, షేక్ సుభాని, గంటా పెద్దబ్బాయి, మౌలిక, వీ.గంగాదర్, జర్నలిస్టు సంఘాల నేతలు భక్తవత్సలరావు, ఐజేయూ గిరధర్‌కుమార్, ఫణీంద్రకుమార్, నరసింహారావు, పరస్యం నాయక్, ఆసిఫ్, నిమ్మరాజు చలపతిరావు, ఎస్ రవికుమార్, ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ సూదా రామచంద్రరావు, ఎడిషన్ ఇన్‌చార్జి సూర్యదేవర సాంబశివరావు, బ్యూరో ఇన్‌చార్జి గింజుపల్లి భాస్కరరావు, స్టాఫ్ రిపోర్టర్లు మధుసూదనరావు, సతీష్, ఏబీఎన్ స్టాఫ్ రిపోర్టరు సాంబశివరావు, ఆంధ్రజ్యోతి యాడ్స్ మేనేజర్ ఎం.సుబ్బారావు, సర్క్యులేషన్ మేనేజర్ భాస్కర్‌రెడ్డి, సబ్ ఎడిటర్లు జీ.వెంకటేశ్వరరావు, సురేంద్ర, పరమేశ్వరరావు, వీరేష్‌కుమార్, బీ శ్రీనివాసరావు, జ్యోతి, లక్ష్మణ్, రిపోర్టర్లు, వివిధ విభాగాల సిబ్బంది పెద్దసంఖ్య లో పాల్గొన్నారు.

వివిధ ప్రాంతాల్లోనూ..

మీడియాపై రాష్ట్రంలో వరుసగా జరుగుతున్న దాడులపై ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా నిరసనలు మిన్నంటాయి. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో ప్రజాసంఘాలు, ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. మున్సిపల్ కార్యాలయం సమీపంలో జర్నలిస్టులు మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. పత్రికా స్వేచ్ఛపై దాడి నశించాలి, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి అంటూ మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్ శివశంకర్‌కు వినతి పత్రం అందజేశారు. పిడుగురాళ్ల, మాచవరం, రాజుపాలెంలో కూడా నిరసన ర్యాలీలు జరిగాయి. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు, తుళ్లూరుల్లో అంబేద్కర్ బొమ్మల వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. బాపట్ల జిల్లా భట్టిప్రోలు రథం సెంటర్‌లో జర్నలిస్టులు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాజీ మంత్రి ఆనందబాబు పాల్గొన్నారు.



రాజుపాలెం సెంటర్లో ర్యాలీ నిర్వహిస్తున్న జర్నలిస్టులు



భట్టిప్రోలు రథం సెంటర్‌లో జరిగిన జర్నలిస్టుల నిరసన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి ఆనందబాబు



కలెక్టర్ శివశంకర్ లోతేటికి వినతి పత్రం అందజేస్తున్న వివిధ పార్టీల నాయకులు



ప్రత్యేక చట్టం తీసుకురావాలి

విధి నిర్వహణలో భాగంగా సభలు, సమావేశాలను కవర్ చేసే విలేకరులపై దాడులు చేయడం అన్యాయం. దాడులకు బలైపోతున్న జర్నలిస్టుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలి. పార్టీలు, సంస్థలు ఏవైనా విభేదాలు ఉంటే వాటికి జర్నలిస్టులను బలి చేయవద్దు. ప్రాణాంత కంగా మారిన నేపథ్యంలో జర్నలిస్టులకు రక్షణ చట్టం తేవాలి.దాడులకు తెగించిన వారిపై చర్యలు తీసుకోవాలి.

- ఎస్ఎన్ మీరా, ఏపీయూడబ్ల్యూజే

ప్రజలే బుద్ధి చెప్పాలి

విలేకరులపై దాడులు, దౌర్జన్యాలు దుర్మార్గం. అభ్యంతరం తెలపడానికి దాడులే మార్గమైతే, బూతులు తిట్టే మంత్రులను ఎన్నిసార్లు కొట్టాలి? ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేవారు రేపు ప్రజాకోర్టులో నుంచోవాలి. వారికి తగిన బుద్ధి ప్రజలే చెబుతారు. సీఎం బహిరంగ క్షమాపణ చెప్పాలి.

- నిమ్మల శేషయ్య

దాడి అమానుషం

పత్రికా విలేకరులపై దాడి అమానుషం. పత్రికా స్వేచ్ఛను హరించే స్థాయికి ప్రభుత్వం దిగజారడం సిగ్గుచేటు. నిజాన్ని నిర్భయంగా చూపించే మీడియాపై దాడి సీఎం అవినీతి అక్రమాలను కప్పిపుచ్చుకోవడానికే. ఎన్నికల నేపథ్యంలో పథకం ప్రకారం దాడులు చేయిస్తున్నారు. విలేకరులకు క్షమాపణ చెప్పి, బాధితుడికి న్యాయం చేయాలి.

- దేగల ప్రభాకర్

దాడులకు జగన్ ప్రోత్సాహం

రాష్ట్రంలో ప్రజలను, ప్రజాస్వామ్యాని తుంగలో తొక్కేందుకు సీఎం జగనే దాడులను ప్రోత్సహిస్తున్నారు. చేతులు మడతపెట్టాలని హింట్లు ఇచ్చి రెచ్చగొడుతున్నారు. వారి అవినీతి బాగోతాలు వెలికితీస్తున్న ఆంధ్రజ్యోతి,ఈనాడు సంస్థలపైనే దాడి చేయాలని సూచించినట్లు కనిపిస్తోంది. కొద్దిరోజుల్లో అధికారం మారుతుంది. దానికి తగిన మూల్యం చెల్లించుకోకతప్పదు. రాష్ట్రంలో రాక్షస పాలనను అంతమొందించి, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునేందుకు మీడియా సహా అందరూ ఏకమవ్వాలి.

- నక్కా ఆనందబాబు, మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు

వినాశకాలే విపరీతబుద్ధి

పోయేకాలం దాపురిస్తే ఇలానే చేస్తారు. వినాశకాలే విపరీతబుద్ధి. రాష్ట్రంలో రాక్షస పాలన సాగుతోందని నాలుగేళ్ల క్రితమే చెప్పా. ఇక ఈ పాలనను తరిమికొట్టేందుకు సమయం వచ్చింది. అందరూ ఒక్కటై జగన్‌ను తరిమికొట్టాలి. **- కన్నా లక్ష్మీనారాయణ, మాజీ మంత్రి**

ప్రజాస్వామ్యం పరిహాసం

నాలుగో స్తంభమైన మీడియాపై దాడులు చేయిస్తున్న జగన్ ప్రజాస్వామ్యాన్ని పరిహసిస్తున్నారు. పాలనా వైఫల్యాలు, అవినీతి, అక్రమాలను వెలికితీస్తున్నా యన్న కోపంతోనే ఆంధ్రజ్యోతి, ఈనాడు లపై దాడులకు తెగిస్తున్నారు. పత్రికా స్వేచ్ఛను కాపాడుకుని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలి. **- నరేంద్రకుమార్, మాజీ ఎమ్మెల్యే**

రాష్ట్రంలో పాశవిక పాలన

పత్రికా స్వేచ్ఛపై దాడి చేసే పాశవిక పాలన ఈ రాష్ట్రంలో అమలు జరుగుతోంది. మీడియా గొంతు నొక్కేస్తున్నారు. తన అవినీతి, అక్రమాలు కప్పి పుచ్చుకునేందుకే మీడియాపై దాడి చేస్తున్నారు. పాత్రికేయులపై దాడులు చేయడం మానుకోకపోతే ప్రత్యక్ష తిరుగుబాటు తప్పదు. దాడులు, దౌర్జనాలకు తెగిస్తున్న పాలకులను ఓడించాలి. **- ముప్పాళ్ల నాగేశ్వరరావు , సీపీఐ**

సీఎం క్షమాపణ చెప్పాలి

ప్రజలు, ప్రజాస్వామ్యంపై రాక్షసులు దాడులు చేస్తారనడానికి నిదర్శనమే రాప్తా డు, కర్నూలు ఘటనలు. ఈ ఘటనలపై సీఎం జగన్ మీడియాకు బహిరంగ క్షమా పణ చెప్పాలి. వైసీపీ ప్రభుత్వం వచ్చాక మీడియాపై దాడులు పరిపాటిగా మారాయి. నియంతృత్వ పాలనకు ప్రజలే చరమగీతం పాడతారు. బాధితుడికి సొంత ఖర్చుతో వైద్యం అందించాలి. **- మస్తాన్‌వలి, ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్**

ప్రజాస్వామ్యంపై దాడి

విలేకర్లపై దాడి ప్రజాస్వామ్యంపై దాడి. ప్రజా స్వామ్యాన్ని పరిరక్షించే మీడియా మిత్రులను భయభ్రాంతులకు గురిచేయాలని సైకో ముఖ్యమంత్రి వారిపై దాడులకు పాల్పడేలా చేస్తున్నారు. దాడులు చేసిన మూకలను వెంటనే అరెస్టు చేయాలి. పత్రికా స్వేచ్ఛను కాపాడాలి. ప్రజలు ఇలాంటి సీఎంకి తగిన బుద్ధి చెప్పాలి.

- మొహమ్మద్ నసీర్ , టీడీపీ తూర్పు ఇన్‌చార్జి

ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలి

రిపోర్టర్లపై దాడి హీనమైన చర్య. అవినీతి అక్రమాలపై ప్రశ్నిస్తున్నందునే అధికారపార్టీ మూకలను సీఎం దాడులకు పురిగొల్పుతున్నారు. పత్రికా స్వేచ్ఛను కాపాడుకుని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలి.

- మన్నవ మోహనకృష్ణ

వైఫల్యం బట్టబయలు

- నిన్నటివరకు కప్పిపుచ్చిన ప్రజాప్రతినిధులు, అధికారులు
- హైకోర్టు జోక్యంతో అధికారులలో చలనం
- ఆరుగురు అధికారుల సస్పెన్షన్
- డయేరియా వ్యాప్తి చెందటంపై ఎట్టకేలకు జీఎంసీ చర్యలు

గుంటూరు(ఆంధ్రజ్యోతి), ఫిబ్రవరి 21: గుంటూరు నగరంలో డయేరియా విజృంభిస్తున్నప్పటికీ ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోలేదు. డయేరియా సోకి నలుగురు మృతి చెందగా నిన్న మొన్నటి వరకు ఏమీ లేదంటూ కప్పిపుచ్చుకొచ్చారు. దీంతో డయేరియా గుంటూరులో మరింతగా విజృంభించింది. పత్రికలో వచ్చిన వార్తలను రాష్ట్ర హైకోర్టు సుమోటోగా తీసుకుంది. డయేరియాపై సమగ్ర నివేదికను అందజేయాలని గుంటూరు జిల్లా లీగల్ సర్వీస్ అధారిటీని ఆదేశించింది. దీంతో జిల్లా లీగల్ సర్వీస్ అధారిటీ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయాధికారి టి.లీలావతి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో డయేరియా వార్డులను సందర్శించారు. దీంతో జీఎంసీ అధికారులలో చలనం ప్రారంభమైంది. హడావుడిగా జీఎంసీకి చెందిన ఆరుగురు అధికారులను సస్పెన్షన్ చేశారు. మరో ముగ్గురికి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. దీంతో గుంటూరు నగరంలో డయేరియా ఏ మేరకు వ్యాప్తి చెంది ఉందో బట్టబయలైంది. నగరంలోని సంగడి గుంట, రైలుపేట, ఆనందపేట, శ్రీనగర్, శారదా కాలనీ, ఇలా అనేక కాలనీలకు డయేరియా వ్యాప్తి చెందింది. అధికారు లు, ప్రజా ప్రతినిధులు మాత్రం డయేరియా లేదు అంటూ పెద్ద ఎత్తున వితండ వాదానికి దిగారు. ఎంత కప్పిపుచ్చాలని చూసినా అది సాధ్యపడలేదు.

ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలే

● తేల్చి చెప్పిన టీడీపీ నిజనిర్ధారణ కమిటీ

గుంటూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): డయేరియా మరణాలన్నీ ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలేనని టీడీపీ నిజనిర్ధారణ కమిటీ తేల్చి చెప్పింది. గుంటూరులోని డయేరియా ప్రభావిత ప్రాంతంలో బుధవారం టీడీపీ నిజనిర్ధారణ కమిటీ పర్యటించింది. గుంటూరులో డయేరియా మరణాల బాధిత కుటుంబాలను కమిటీ సభ్యులైన మాజీ మంత్రులు నక్కా ఆనందబాబు, కన్నా లక్ష్మీనారాయణ, గుంటూరు తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్ సహా పలువురు టీడీపీ నేతలు పరామర్శించారు. తిరుమలాచారి కాలనీ చెందిన ఓబులు, రైలుపేటకు చెందిన షేక్ ఇక్బాల్, శ్రీనగర్‌కి చెందిన గాజుల సూర్యనారాయణ, మాలంపాటి శంకర్, మద్దెల పద్మ కుటుంబాలను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ నగరంలో కలుషిత నీరు సరఫరా చేయడంతో ప్రజల అనారోగ్య పాలై ఐదుగురు మరణించినాగానీ ప్రభుత్వ యంత్రాంగం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. తప్పును కప్పిపుచ్చుకోవడానికి మంత్రి రజిని, స్థానిక ఎమ్మెల్యే అసత్య ప్రచార చేయడం సిగ్గుచేటని అన్నారు. బాధితులకు రూ.5 లక్షలు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా నగరంలో కలుషిత నీటితో ఐదుగురు మరణించడం బాధాకరమన్నారు. నసీర్ మాట్లాడుతూ గత 15 రోజులుగా కలుషిత నీటి సరఫరాతో డయేరియా బారిన పడి 300 మంది అనారోగ్యం పాలై పలు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని, ఇప్పటికే ఐదుగురు చనిపోయారని అన్నారు. ప్రభుత్వం పట్టించుకోకపోతే తెలుగుదేశం పార్టీ తరఫున పోరాటాలు చేస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్, నాయకులు చిట్టిబాబు, మ్యాని, జాగర్లమూడి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు భారతి. సమత, వేముల కొండ శ్రీనివాస్, బ్రహ్మసాని శ్రీనివాసరావు, శ్రీను, దయారత్నం, గుడిపల్లి వాణి, వజ్జా లక్ష్మి, రహమునిస,విజయలక్ష్మి, ఉస్మాన్, ఆనం ద్, అన్వర్, హఫీజ్, మల్లంపూడి శ్రీనివాసరావు, మహంకాళి నరసింహారావు పాల్గొన్నారు.



తూర్పు నియోజకవర్గంలో పర్యటిస్తున్న నిజనిర్ధారణ కమిటి

డయేరియా ప్రాంతాల్లో... తాగు నీటి కష్టాలు

గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి21: డయేరియా ప్రబలిన ప్రాంతాల్లో ప్రజలు తాగునీటి కోసం కష్టాలు పడుతున్నారు. తాగునీటి కలయిక వల్లే డయేరియా వచ్చిందంటూ అధికారులు భావించి శారదకాలనీలో పాత పైప్‌లైన్లకు ఉన్న ట్యాప్ కనెక్షన్లను తొలగించి, వాటి స్థానంలో కొత్త పైప్‌లైన్‌కు కనెక్షన్లు ఇస్తున్నారు. ఈ ప్రక్రియ తీవ్ర జాప్యం జరగడంతో ఆయా ప్రాంతాల్లో ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. ఓ పక్క ట్యాంకర్లతో సరఫరా చేస్తున్న నీరు చాలటం లేదు. దీంతో ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుంటున్నారు. వసంతరాయపురం ప్రధాన పైప్‌లైన్‌పై అనేకచోట్ల మరమ్మతులు ప్రారంభించారు. అవి ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. శారద కాలనీలోని అనేక ప్రాంతాల్లో మంచినీటి పాత పైప్‌లైన్‌పై ఉన్న ట్యాప్‌లను కట్ చేస్తున్నారు. కొత్తగా కొళాయి కనెక్షన్లను ఇస్తున్నారు. కొంతమంది కుళాయి ఇన్‌స్పెక్టర్లు, ఫిట్టర్లు కనెక్షన్లుదార్ల వద్ద డబ్బులు వసూలు చేస్తున్నారు. ప్రతి కుళాయి కనెక్షన్‌కు రూ.4వేల నుంచి రూ.ఆరు వేల వరకు దండుకుంటున్నారు. మంచినీటి ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్న నీరు అరకొరగా ఉండడంతో ప్రజలు తాగునీటి కోసం అల్లాడుతున్నారు. సరఫరా చేస్తుంది నాలుగు ట్యాంకులు అయితే పది ట్యాంకులుగా అధికారులు రాసుకుంటున్నారు. ట్యాంకర్ల ద్వారా వస్తున్న నీరు చాలక ప్రజలు బావులు, ఇళ్లలోని మోటార్ బోర్లు వద్ద నుంచి పట్టుకుంటున్నారు.

25న ఎయిమ్స్ జాతికి అంకితం

● హాజరుకానున్న గవర్నర్ అబ్దుల్‌నజీర్
● ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా అధికారులు

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 21: మంగళగిరిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మితమైన అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ(ఎయిమ్స్)ను ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల 25న వర్చువల్ విధానంలో జాతికి అంకితం చేయనున్నారు. 183.11 ఎకరాల విస్తీర్ణంలో ఎయిమ్స్ నిర్మాణం జరిగింది. 960 పడకల ఆస్పత్రి, 125 ఎంబీబీఎస్ సీట్లతో వైద్య కళాశాల కోసం కేంద్రం రూ.1,618.23 కోట్లు ఖర్చు చేసింది. ఎయిమ్స్‌లో జరగనున్న ఈ కార్యక్రమానికి గవర్నరు ఎస్.అబ్దుల్ నజీర్ హాజరుకానున్నారు. ఇందుకోసం ఎయిమ్స్ వద్ద జరుగుతున్న ఏర్పాట్లను కలెక్టరు ఎం.వేణుగోపాల్‌రెడ్డి వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనరు జే.నివాస్, ఎస్పీ తుషార్‌దూడీతో కలిసి బుధవారం పరిశీలించారు. గవర్నరు, మంత్రులు, ఇతర ప్రముఖులు హాజరు కానున్న నేపథ్యంలో అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, సాంఘీక సంక్షేమ శాఖ డీడీ మధుసూదనరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, నివాస్



నిరుపయోగంగా ఉన్న గోదావరి-పెన్నా నదుల అనుసంధానానికి ఉపయోగించే యంత్రాలను చూపిస్తున్న కన్నా లక్ష్మీనారాయణ

జగన్‌లాంటి దుర్మార్గులను తరిమేయాలి

- శిథిలమౌతున్న రూ. కోట్ల విలువచేసే యంత్ర సామగ్రి
- మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ

రాజుపాలెం, ఫిబ్రవరి21: వందల కోట్ల రూపాయలు విలువచేసే యాంత్రాలను మట్టిపాలు చేసిన ఈ సీఎం జగన్‌లాంటి వారిని తరిమేయాలని టీడీపీ జనసేన పార్టీల సత్తెనపల్లి నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. బుధవారం గుంటూరు-మాచర్ల రహదారిపై మండలంలోని రాజుపాలెం గ్రామ సమీపంలోవున్న గోదావరి-పెన్నా నదుల అనుసంధానం నిమిత్తం ఉపయోగించే యాంత్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ 2014-19 మధ్య ఈ రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం ముందు చూపుతో ఈ ప్రాంత ప్రజలకు తాగు, సాగు నీరు అందించాలనే ఉద్దేశంతో గోదావరి-పెన్నా అనుసంధానం చేసేందుకు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణ నిమిత్తం రూ.6 వేల కోట్లు మంజూరు చేసి పని కూడా ప్రారంభించారని తెలిపారు. ఎన్నికల అనంతరం వైసీపీ అధికారంలోకి రావడం, జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా కావటంతో ఈ ప్రాజెక్టు మరుగున పడిపోయిందన్నారు. అప్పటి నుంచి వందల కోట్ల రూపాయల విలువ చేసే భారీ యంత్రసామగ్రి నిరుపయోగంగా మారిందని, ప్రజల తాగు, సాగు నీటి కష్టాలు తీర్చే ప్రాజెక్టు పని కనుమరుగైందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రమాదకర స్థాయిలో శాంతి భద్రతలు

- మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి21: ఐదు సంవత్సరాలుగా రాష్ట్రాన్ని అరాచకానికి కేరాఫ్ అడ్రస్‌గా మార్చిన సీఎం జగన్‌రెడ్డి పాలనలో కొన్ని రోజులుగా శాంతి భద్రతలు మరింత ప్రమాదంలో పడ్డాయని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఆందోళనవ్యక్తంచేశారు. బుధవారం చిలకలూరిపేట గోల్డ్‌బజారులో నిర్వహించిన బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో ప్రత్తిపాటి, జనసేన సమన్వయకర్త తోట రాజారమేష్‌లు పాల్గొని టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అమలు చేయబోయే సూపర్ 6 సంక్షేమ పథకాల గురించి స్థానిక బంగారు వర్తకులకు, ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆర్యవైశ్యులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ నాలుగున్నర దశాబ్దాల చంద్రబాబు రాజకీయ అనుభవంతో ఈ సూపర్ - 6 హామీలకు రూపకల్పన చేశారని అన్నారు. కొన్ని రోజులుగా ప్రతిపక్షాలు, పత్రికలు లక్ష్యంగా చేసుకొని పెరిగిన వైసీపీ దాడులు అత్యంత హేయం అన్నారు. నిజాలను చూపిస్తుంటే జీర్ణించుకోలేక వైఫల్యాలను ప్రశ్నిస్తుంటే తట్టుకోలేక ఇలా దౌర్జన్యాలకు దిగుతున్నారని, ప్రజాస్వామ్యంలో ఇలాంటి పోకడలకు తావు లేదని ప్రత్తిపాటి పేర్కొన్నారు. తెలుగుదేశం, జనసేన ఉమ్మడి ప్రభుత్వం రాగానే గాడి తప్పిన శాంతి భద్రతలను చక్కదిద్దుతామని, జగన్ ప్రభుత్వ అండ చూసుకొని ఇప్పుడు ఇలా అరాచకాలకు పాల్పడుతున్న వారందరిపై తప్పక చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జనసేన నేత తోట రాజా రమేష్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పవన్‌కళ్యాణ్, చంద్రబాబుల నేతృత్వంలో జనసేన, తెలుగుదేశం కూటమి అభ్యర్థులను గెలిపించి రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి పట్టం కట్టాలని ప్రత్తిపాటి పుల్లారావు కోరారు.

విలేకరులపై దాడులు హేయం



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

- చొక్కామడత పెట్టడమంటే దాడులు చేయమనా..!
- మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి రూరల్, ఫిబ్రవరి 21: సిద్ధం సభలో జగన్‌మోహన్‌రెడ్డి చొక్కా మడతపెట్టమనడం అంటే ప్రజలకు సమాజపోకడలను నిర్భయంగా తెలిపే విలేకరులపై దాడులు చేసి చావబాదటమేనా అని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రశ్నించారు. బుధవారం పట్టణంలోని మారీసుపేట పెండ్యాల వెంకట్రావు కల్యాణమండపంలో బుధవారం బీసీ సంఘనేతలతో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జగన్ రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుండి దాడుల సంస్కృతికి తెరలేపారని ఆరోపించారు. అది పెరిగి పెరిగి చివరకు పత్రికా విలేకరులు, ఫొటోగ్రాఫర్లపై దాడులకు పురమాయిస్తున్నాడని విమర్శించారు. జగన్‌రెడ్డి తన పదవీకాలంలో దోచుకోవడం, దాచుకోవడం, ప్రశ్నించిన వారిపై దాడులుచేయడం లేదా అక్రమకేసులు పెట్టి నోరు మూయించడం తప్ప చేసిందేమీ లేదన్నారు. జగన్ సిద్ధం సభకు వచ్చిన విలేకరులు, ఫొటోగ్రాపర్లపై వైసీపీ మూక దాడిచేసి, చిత్రహింసలు పెడుతుంటే రక్షణ కల్పించాల్సిన పోలీసులు ఎందుకు కాపాడలేకపోయారని ప్రశ్నించారు. చివరికి ఆ మూకల నుండి పోలీసులు గాయపడిన విలేకరులను ఆసుపత్రికి తరలించకుండా పోలీస్ స్టేషన్‌కు తరలించడం దుర్మార్గమన్నారు.సామాజిక న్యాయం, పత్రికా స్వేచ్ఛకు ఈ ప్రభుత్వంలో భద్రత ఎక్కడుందో ప్రజలందరూ ఆలోచించాలన్నారు. సమాజంలో ప్రభుత్వానికి ప్రజలకు వారదులుగా నిజాన్ని నిర్భయంగా రాసే పత్రికల స్వేచ్ఛపై దాడి చేయడం వైసీపీ నీచ సంస్కృతికి నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రిగా జగన్ ప్రజలకు మంచి చేసి ప్రశాంత వాతావరణం నెలకొల్పాసింది పోయి దాడులను ప్రోత్సహిస్తున్న తీరు చేస్తుంటే యువతరం ఏమైపోతుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపిస్తున్న పత్రిక యాజమాన్యాన్ని కూడా వదిలిపెట్టని పరిస్థితికి జగన్ దిగజారడం చూస్తుంటే ప్రజాస్వామ్యానికి, పత్రికా స్వేచ్ఛకు ఆయన ఇచ్చే విలువేంటో తేటతెల్లమైందన్నారు. నా ఎస్సీలు, నా బీసీలు, నా మైనార్టీలు అంటూ చెబుతూనే వారిపై చేస్తున్న అరాచకాలు, నిరంకుశ పాలన వంటి అంశాలను వెలుగులోకి తెస్తున్నారన్న అక్కసుతో ఇటువంటి వాటికి పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. ఆ నాడు జగన్ తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పత్రికా స్వేచ్ఛ హరించే 930వ జీవోను తీసుకువస్తే అప్పట్లో జరిగిన ఆందోళనలకు వెనక్కి తీసుకున్నారని నేడు మళ్ళీ కొడుకుగా జగన్ ఆజీవోని తీసుకువచ్చారన్నారు. సిద్ధం సభలో సీఎం జగన్‌రెడ్డి చొక్కా చేతులు మడవండి అంటే తమకు వ్యతిరేకంగా ఎవరున్నా వారిని చావ బాదమని చెబుతూ వారి పార్టీ శ్రేణులకు ఉసి గొల్పటమేనా అని ప్రశ్నిచారు. విలేకరులపై దాడులు చేసిన మూకలను పోలీసులు మూడు రోజులకు గాను ఒక్కడిని మాత్రమే పట్టుకుని అరెస్ట్ చేసి నాన్చుడు ధోరణితో వ్యవహరిస్తున్న పరిస్థితి స్పష్టంగా కనిపిస్తుందన్నారు. తక్షణమే దాడులకు పాల్పడిన నిందితులను పట్టుకుని మరో మారు ఇటువంటి ఘటనలకు తావు లేకుండా కఠిన శిక్షలు విధించాలని ఆలపాటి డిమాండ్ చేశారు. పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు తాడిబోయిన హరిప్రసాద్, కేసన కోటేశ్వరరావు, గిరి గణేష్, ఫణిదపు దుర్గ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వీఈవీటీలో విద్యార్థులతో సినీ హీరో వరుణ్ తేజ్

వీవీఐటీలో వరుణ్ తేజ్ సందడి

పెదకాకాని, ఫిబ్రవరి 21 : సినీ హీరో వరుణ్ తేజ్ వీవీఐటీ కళాశాలలో బుధవారం సందడిచేశారు. ఆయన నూతనంగా నటించిన ఆపరేషన్ వాలంటైన్ చిత్రం మార్చి 1న విడుదల కానున్న నేపథ్యంలో చిత్ర ప్రచారంలో భాగంగా ఆయన వీవీఐటీని సందర్శించారు. ఈ సందర్భంగా హీరో వరుణ్ తేజ్ మాట్లడుతూ దేశభక్తి మనలో అంతర్లీనంగా ఉంటుందని, ఈ చిత్రం దేశభక్తి చిత్రం అని అన్నారు. ఇటువంటి చిత్రం ద్వారా మీముందుకు రావడం ఆనందంగా ఉందని అన్నారు. ఈచిత్రం ద్వారా జవాన్ల త్యాగాలు వారి ధైర్య సాహసాలను మీముందుకు తీసుకువచ్చే ప్రయత్నం చేశామని తెలిపారు. ఈ చిత్రం చూసిన అనంతరం భారతీయులుగా పుట్టినందుకు గర్వంగా బయటికి వస్తారని అన్నారు. ప్రేక్షకులకు నిరంతరం కొత్తదనం అందించే ప్రయత్నం చేస్తుంటానని అన్నారు. అనంతరం విద్యార్థులు సెల్ఫీలతో సందడి చేశారు.



తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు , రైతులు

అమరావతిపై కక్ష పెంచుకుంటే వైసీపీకే నష్టం

- 1527వ రోజుకు చేరిన రైతుల ఆందోళనలు, దీక్షలు

తుళ్లూరు, ఫిబ్రవరి 21: రాజధాని అమరావతిపై కక్ష పెంచుకుంటే వైసీపీ పాలకులకే నష్టమని రాజధాని నిర్మాణానికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు బుధవారం నాటికి 1527వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ, ఐదు కోట్లమంది కోరుకునే రాజధాని అమరావతి విధ్వంసం తగదని సీఎం జగన్‌రెడ్డికి హితవు పలికారు. ప్రత్యేక హోదా తెచ్చి రాష్ట్రంలోని మూడు ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్నారు. కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తామన్న జగన్‌రెడ్డి, అదే కేంద్రం ముందు మోకరిల్లారని ఆరోపించారు. సీఎంకి దమ్ముంటే విభజన చట్టంలో హామీలను అమలు పరిచి రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. మూడు రాజధానులు కావాలని రాష్ట్రంలో ఏ ఒక్కరూ అడగలేదన్నారు. ప్రజాభిప్రాయం లేకుండా మూడు ఎలా పెడతారని ప్రశ్నించారు. భారత రాజ్యాంగంలో లేని మూడు రాజధానుల ప్రతిపాదన తేవటానికి సీఎం జగన్‌రెడ్డికి సిగ్గుండాలన్నారు. అందుకు వంత పాడుతున్న వైసీపీ ఎమ్మెల్యేలు ,మంత్రులకు అంత కన్నా సిగ్గు లేదని విమరిృంచారు. అమరావతి వెలుగు కార్యక్రమలో భాగంగా రైతులు దీపాలు వెలిగించి నినాదాలుచేశారు. రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.

మర్రెడ్డిపై హత్యాయత్నం దుర్మార్గం

- టీడీపీ పల్నాడుజిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఫిబ్రవరి 21: తెలుగు రైతు సంఘం అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిపై జరిగిన హత్యాయత్నాన్ని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తీవ్రంగా ఖండించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హత్యాయత్నం వెనుక వైసీపీ నేతల హస్తం ఉందని విమర్శించారు. పార్టీ పట్ల అంకితభావంతో పనిచేస్తూ రైతు సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్న మర్రెడిపై జరిగిన దాడి అమానుషమని అన్నారు. వ్యక్తిగత కక్షతో తనను హతమార్చేందుకు కిరాతకంగా పథకం ప్రకారం దాడి చేశారన్నారు. జేమ్స్ ఆసుపత్రి యజమాని రామచంద్రారెడ్డి వెనుక వైసీపీ నాయకుల ప్రోత్సాహం, కుట్ర దాగి ఉందని ఆయన ఆరోపించారు. అదేవిధంగా కర్నూలులో ఈనాడు ప్రాంతీయ కార్యాలయంపై వైసీపీ దుండగుల దాడి అత్యంత హేయనీయమైన చర్య అని అన్నారు. వినుకొండలో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు రౌడీయిజాన్ని ప్రోత్సహిస్తున్నారని ధ్వజమెత్తారు. మంగళవారం ఎమ్మెల్యే బొల్లా జన్మదిన వేడుకలు జరుపుకుంటూ టీడీపీ బ్యానర్లు చించివేయించడం, ధ్వంసం చేయించి అల్లర్లను రెచ్చగొడుతున్నారన్నారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించి శిలాఫలకాలు కూడా ధ్వంసం చేయించడం దుర్మార్గమన్నారు. ఆసుపత్రి నిర్మించకుండానే బొల్లా బ్రహ్మనాయుడు 100 పడకల ఆసుపత్రిని నిర్మించామని ఉదరగొట్టడం హాస్యాస్పదమన్నారు. వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణం చేసే ఆలోచన వైసీపీకి లేదని, జీవో ఇచ్చి నిధులు కేటాయించిన టీడీపీతోనే వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణం సాధ్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పెమ్మసాని నాగేశ్వరరావు, షమీమ్ ఖాన్, ముంద్రు సుబ్బారావు, మద్దుల వెంకటేశ్వరరెడ్డి, పత్తిపూర్ణ, మాదాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



ఆరుపళ్ల విభాగంలో బండ లాగుతున్న ఎడ్లజత

ఆరుపళ్ల విభాగంలో
కాకుమాను ఎడ్లజత విజేత

మాచవరం, ఫిబ్రవరి21: మండలంలోని మోర్జంపాడు గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి 58వ కల్యాణమహోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు జరుగుతున్నాయి. బుధవారం నిర్వహించిన ఆరుపళ్ల విభాగంలో గుంటూరు జిల్లా కాకుమాను మండలం, కొండబాలవారిపాలెం గ్రామానికి చెందిన గూడవల్లి లక్ష్మీదీక్షితచౌదరి ఎడ్లు 5,200 అడుగుల దూరాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. గుంటూరు జిల్లా పత్తిపాడు గ్రామానికి చెందిన పమిడి అంజయ్య చౌదరి, గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొండబాలవారిపాలెం గ్రామానికి చెందిన గూడవల్లి లక్ష్మీదీక్షిత చౌదరి కంబైన్డ్ ఎడ్లజత 4,800 అడుగుల దూరాన్ని లాగి రెండవ స్థానంలో నిలిచాయి. గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొండపాటూరు గ్రామానికి చెందిన పోతిన లక్షిత్ చౌదరి ఎడ్లు 4533.10 అడుగుల దూరాన్ని లాగి మూడవ స్థానంలో నిలిచాయి.

నాలుగుపళ్ల విభాగంలో..

నాలుగుపళ్ల విభాగంలో జరిగిన పోటీల్లో గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం సరిపూడి గ్రామానికి చెందిన వెదుళ్లపల్లి శ్రీనివాసరావు, పాలడుగు గ్రామానికి చెందిన శాఖమూరి విజయ్‌పవన్‌కుమార్ కంబైన్డ్ ఎడ్లజత 5,000 అడుగుల దూరాన్ని లాగి ప్రథమస్థానంలో నిలిచాయి. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రామచంద్రాపురం గ్రామానికిచెందిన దండు అప్పారావు, బాపట్ల జిల్లా బల్లికురువ మండలం గంగపాలెం గ్రామానికిచెందిన రాయుడు సుబ్బారావు కంబైన్డ్ ఎడ్ల జత 4680.5 అడుగుల దూరాన్ని లాగి రెండవ స్థానంలో నిలిచాయి. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలం వైకొత్తపల్లి గ్రామానికి చెందిన కపులూరి హుస్సేన్ ఎడ్లజత 4658.10 అడుగుల దూరాన్ని లాగి మూడవ స్థానంలో నిలిచాయి. సూరప నేని రాధాకృష్ణ, దుగ్గి శ్రీనివాసరావులు న్యాయ నిర్ణేత లుగా వ్యవహరిస్తున్నారు.



గంజాయి విక్రేతను అరెస్టు చూపిస్తున్న సీఐ కోటేశ్వరరావు

గంజాయి విక్రేత అరెస్టు

- 1 కిలో సరుకు స్వాధీనం.. ఆటో సీజ్

చేబ్రోలు, ఫిబ్రవరి21: గంజాయి తాగడంతోపాటు విక్రయాలకు పాల్పడుతున్న ఒరిస్సాకు చెందిన వ్యక్తిని అరెస్టు చేసి ఒక కిలో గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పొన్నూరు రూరల్ సీఐ వైకోటేశ్వరావు తెలిపారు. బుధవారం చేబ్రోలు పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిందితుడి అరెస్టు, వివరాలను సీఐ వెల్లడించారు. ఒరిస్సా రాష్ట్రానికి చెందిని గురుశెట్టి అనే వ్యక్తి రెండేళ్ల క్రితం కుటుంబంతో సహా బదుకుతెరువు కోసం చేబ్రోలు వచ్చి స్పినింగ్ మిల్‌లో పనిచేస్తున్నాడు. గురిశెట్టికి సోమనాథ్ అనే వ్యక్తి పరిచయం కాగా ఇద్దరు గంజాయికి బానిసలయ్యారు. వారం రోజుల క్రితం పలాసకు చెందిన బాలకృష్ణ అనే వ్యక్తి సోమనాధ్‌కు ఒక కిలో గంజాని తీసుకొచ్చి ఇచ్చాడు. ఈ నెల 20న గురుశెట్టి ఆ గంజాయిని అమ్మటానికి ఆటోలో వెళ్లతుండగా విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు అదుపులోకి తీసుకొని, గంజాయిని స్వాధీనం పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేయడంలో ప్రతిభ కనబరిచిన చేబ్రోలు పీఎస్ ఎస్ఐ వీ.మహేష్‌కుమార్, సిబ్బందిని అభినందించారు.

విద్యుత్‌శాఖ ఏఈకి ఏసీబీ షాక్ !

- రైతు వద్ద లంచం తీసుకుంటూ పట్టుబడ్డ వైనం
- రూ 55 వేలు లంచం సొమ్ము స్వాధీనం

చిలకలూరిపేట, ఫిబ్రవరి 21 : చిలకలూరిపేట విద్యుత్ శాఖ రూరల్ ఏఈ ఆర్.ప్రకాశరావునాయక్ బుధవారం తన కార్యాలయంలో లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఏసీబీ అధికారుల తెలిపిన వివరాల ప్రకారం.. చిలకలూరిపేట మండలం కమ్మవారిపాలెం గ్రామానికి చెందిన గడిపూడి అనీల్‌కుమార్ వ్యవసాయ విద్యుత్ సర్వీస్ మీటరు కోసం ప్రకాశరావు నాయక్ చుట్టూ గత కొంత కాలంగా తిరుగుతున్నాడు. ఇందుకు ప్రకాశరావు నాయక్ రూ.70వేలు లంచంగా ఇవ్వాలని డిమాండ్‌చేశాడు. లంచం ఇవ్వటం ఇష్టం లేని బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ కాల్ సెంటర్‌కు ఫోన్‌చేసి ఏఈపై ఫిర్యాదు చేశాడు. దీంతో ఏసీబీ అధికారులు పథకం ప్రకారం రూ.55వేలు లంచం తీసుకుంటుండగా ఏఈ ప్రకాశరావునాయక్‌ను ఆయన కార్యాలయంలోనే పట్టుకున్నారు. ఏఈని అవినీతి నిరోధకశాఖ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపెడతామని అధికారులు తెలిపారు. ఏసీబీ డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ మహేంద్ర మత్తె, డీఎస్పీలు సత్యానందం, ప్రతాప్‌కుమార్, ఆరుగురు సీఐలు తదితర సిబ్బంది ఈ దాడుల్లో పాల్గొన్నారు. అధికారులు లంచం అడిగితే 14400 నెంబరుకు ఫిర్యాదు చేయాలని డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మల్లాది విష్ణు, లక్ష్మీపార్వతి, వీసీ రాజశేఖర్

తెలుగు భాషను కాపాడుకుందాం

- ఏఎన్‌యూలో ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

పెదకాకాని, ఫిబ్రవరి 21: దేశాభివృద్ధి ఆయా భాషా సంస్కృతులపై ఆధారపడి ఉంటుందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య పట్టేటి రాజశేఖర్ అన్నారు. తెలుగు, సంస్కృత అకాడమీలు సంయుక్తంగా బుధవారం విశ్వవిద్యాలయంలోని వేణుగోపాల్‌రెడ్డి సెమినార్ హాల్లో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీసీ హాజరై తెలుగుభాషా ఔన్నత్యాన్ని వివరించారు. తెలుగు భాషను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని పిలుపునిచ్చారు.విజయవాడ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ తెలుగు సంస్కృత భాషలు ఎంతో గొప్పవని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు సంస్కృత భాషలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. తెలుగు సంస్కృత భాష అకాడమీ చైర్మన్‌డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు సంస్కృత భాషల అభివృద్ధికి సీఎం తోడ్పాటు అందిస్తున్నారన్నారు. ఇటువంటి కార్యక్రమాల నిర్వహణకు విశ్వవిద్యాలయం అందిస్తున్న తోడ్పాటు పట్ల ఉపకులపతి రాజశేఖర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమీ సంచాలకులు వీ.రామకృష్ణ, విశ్వవిద్యాలయ రెక్టర్ ఆచార్య పి.వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, ఉద్యోగులు పాల్గొన్నారు. అనంతరం భాషా పండితులకు సన్మానం చేశారు.

పెంపుడు కొడుకు చేతిలో తండ్రి హతం

- కత్తితో నరికి చంపిన కసాయి
- తల్లికీ తీవ్ర గాయాలు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 21: ఆస్తి కోసం పెంపుడు తండ్రిని నరికి చంపిన ఘటన పిడుగురాళ్ల పట్టణంలోని గాంధీనగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన యోహాను(79), చిట్టెమ్మ భార్యాభర్తలు. యోహాను గతంలో ప్రభుత్వ శాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ చేశాడు. వారికి సంతానం లేకపోవడంతో అన్న కుమారులైన అంబేడ్కర్, బాబులను చిన్నతనం నుంచే పెంచుకున్నారు. అంబేడ్కర్ సుమారు 40 కేసుల్లో ముద్దాయి కాగా రెండేళ్ల జైలు జీవితం గడిపి ఇటీవల బెయిల్‌పై వచ్చాడు. ఆ సమయంలో యోహానుకు పక్షవాతంరాగా తమ్ముడు బాబు సపర్యలు చేశాడు జైలు నుంచి వచ్చిన అంబేడ్కర్ తనకు దక్కాల్సిన ఆస్తిని యోహాను.. బాబుకు కట్టబెడతాడనే అనుమానం పెంచుకున్నాడు. ఈ విష యమై కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. దీనిపై పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు రాగా కుటుంబ సభ్యులు, పెద్దలు కూర్చొని ఆస్తిపంపకాలు చేసుకోవాలని పోలీసులు సూచించారు. అయినా గొడవలు సద్దుమణగ లేదు. ఈక్రమంలో బుధవారం అంబేడ్కర్ తన వెంటతెచ్చుకున్న కొబ్బరిబొండాల కత్తితో ఇంట్లోవున్న యోహాను ముఖంపై, మెడపై నరికాడు. యోహాను భయంతో వీధిలోకి పరిగెత్తాడు. అయినా వదలకుండా వీధిలోనే కత్తితో నరకడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అడ్డొచ్చిన యోహాను భార్య చిట్టెమ్మను గాయపరచడంతో ఆమె స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. సమాచారం అందుకున్న పట్టణ సీఐ పీవీ ఆంజనేయులు, డీఎస్పీ పళ్లంరాజు, ఎస్ఐ రబ్బాని, అమీర్‌లు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వ్యక్తిని గొంతుకోసి హత్య

దాచేపల్లి, ఫిబ్రవరి 21: గుర్తుతెలియని వ్యక్తిని గొంతుకోసి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. బుధవారం దాచేపల్లి ఎస్ఐ శివనాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పొందుగల గ్రామంవద్ద రాష్ట్ర రవాణాశాఖ చెక్‌పోస్టు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి చనిపోయి వుండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. ఘటనా స్థలానికి చేరుకొని విచారిం చగా మృతుడు 40నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగివున్నాడని, మెడవద్ద కత్తితో కోసినట్లు గాయం ఉన్నట్లు తెలిపారు. అతను ధరిం చిన దుస్తులను బట్టి లారీ డ్రైవర్‌గా భావిస్తున్నారు. మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దాచేపల్లి ఎస్ఐ శివనాగరాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	155, 164,175
చికెన్ విత్ స్కిన్	300.00
చికెన్ స్కిన్ లెస్	310.00

1,35,644 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,39,400 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,35,644 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 1,09,411 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	20700
నెంబరు. 5	13000	19000
273	12500	16500
341	12000	20000
4884	13700	17500
సూపర్ 10	16200	19000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	21000
బ్యాడిగి	9500	20000
దేవనూరు డీలక్స్	12000	20000
తెల్లకాయలు	5000	12000

మళ్లీ క్రైస్తవులను మోసం చేసేందుకు జగన్ పన్నాగం

- టీడీపీ క్రిష్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు స్వామిదాసు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 21: రాష్ట్రంలో క్రైస్తవులను మరోసారి మోసం చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి తెరలేపారని తెలుగుదేశం పార్టీ క్రిష్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఈటె స్వామిదాసు విమర్శించారు. బుధవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 75వేల మంది పాస్టర్లు ఉంటే కేవలం పది శాతం మందికే గౌరవ వేతనాలు ఇస్తూ మిగిలిన వారిని నిలువునా మోసం చేస్తున్నారని అన్నారు. చర్చిలు, శ్మశానవాటికలు, క్రైస్తవ కాలనీలు ఎన్ని నియోజకవర్గాల్లో ఏర్పాటు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతి చర్చి నిర్మాణానికి రూ.5 లక్షలు ఫండ్ ఇస్తానని చెప్పి క్రైస్తవుల ఓట్లను దండుకున్నారని అన్నారు. బ్రదర్ అనిల్ రాష్ట్రంలోని పాస్టర్లతో సమావేశాలు ఏర్పాటు చేసి మేనిఫెస్టో చూపించి జగన్‌ను గెలిపిస్తే క్రైస్తవులకు మంచి రోజులు వస్తాయని చెప్పారన్నారు. క్రైస్తవుల ఓట్లతో గెలుపొంది గడిచిన నాలుగున్నర సంవత్సరాలుగా ఏ ఒక్క సంక్షేమ పథకం ఇవ్వకుండా నిలువునా మోసం చేశారని ఆయన వాపోయారు. ఇప్పుడు విమలారెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా క్రైస్తవులకు మోసపూరిత హామీలు ఇస్తున్నారని, క్రైస్తవులపై దాడులు జరిగినప్పుడు, ఆస్తులు ఆక్రమించినప్పుడు వీరంతా ఏమయ్యారో సమాధానం చెప్పాలన్నారు. గత టీడీపీప్రభుత్వ హయాంలో 277 చర్చిలు నిర్మించామని, వైసీపీ ప్రభుత్వంలో ఒక్క చర్చి అయినా నిర్మించారా? అని ప్రశ్నించారు. కార్యక్రమంలో క్రిష్టియన్ నేతలు శ్యామ్, ఇనగంటి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

జర్నలిస్టుల భద్రతపై ప్రత్యేక దృష్టి

- ముందు జాగ్రత్త చర్యలపై అధికారులను ఆదేశించాం
- జర్నలిస్టు సంఘాల నాయకులకు ఎస్పీ తుషార్ డూడీ హామీ



ఎస్పీ తుషార్ డూడీ

గుంటూరు ఫిబ్రవరి 21 : ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా ఉన్న మీడియా ప్రతినిధుల రక్షణకు ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ హామీ ఇచ్చారు. ఇటీవల అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం సభలో ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణపై వైసీపీ గూండాలు దాడిచేసిన ఘటనను నిరసిస్తూ ఏపీయూడబ్ల్యూజేతో పాటు వివిధ జర్నలిస్టు సంఘాల నేతలు బుధవారం నగరంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఎస్పీని కలసి వినతిపత్రం అందజేశారు. ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్ట్ శ్రీకృష్ణపై విచక్షణా రహితంగా దాడిచేసిన నిందితులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సంఘాల నేతలు ఎస్పీని కోరారు. జర్నలిస్టులపై దాడుల నియంత్రణకు ప్రత్యేక చట్టం కావాలని డిమాండ్ చేశారు. ఎస్పీ మాట్లాడుతూ.. ఇప్పటికే జర్నలిస్టుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించామని, ఎటువంటి ఘటనలకు తావులేకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికార యంత్రాంగానికి ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. జిల్లాలో విలేకరులపై ఎటువంటి దాడులు జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. అదే సమయంలో జర్నలిస్టులు కూడా తమ పరిధిలో పనిచేయాలని సూచించారు.

సచివాలయ ముట్టడికి అనుమతి లేదు

- ఎవరైనా పాల్గొంటే కఠిన చర్యలు .. ఎస్పీ తుషార్‌డూడీ

గుంటూరు. ఫిబ్రవరి 21 : కాంగ్రెస్ పార్టీ, దాని అనుబంధ సంఘాల వారు మెగా డీఎస్సీ నోటిఫికేషన్, ఇతర సమస్యల పరిష్కారానికి తలపెట్టిన 'చలో సెక్రటేరియట్ ముట్టడి' కార్యక్రమానికి ఎటువంటి అనుమతులు లేవని ఎస్పీ తుషార్ డూడి స్పష్టంచేశారు. 22న కాంగ్రెస్‌పార్టీ, దాని అనుబంధ సంఘాలైన ఎన్‌ఎస్‌యుఐ, యూత్ కాంగ్రెస్ నాయకులు మెగా డీఎస్సీ నోటిఫికేషన్, ఇతర సమస్యల పరిష్కారానికి తలపెట్టిన ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్‌ను ముట్టడిస్తామని ప్రకటించారన్నారు. వారు తలపెట్టిన కార్యక్రమానికి ఇతర నిరుద్యోగ సంఘాలు మద్దతు తెలిపిన విషయం విదితమే. ఆ కార్యక్రమ నిర్వహణ నిమిత్తం కాంగ్రెస్‌పార్టీ గానీ, వారి అనుబంధ సంఘాల నేతలు ఎవరు అనుమతికోసం దరఖాస్తు చేయలేదని, అందుకు ఎటువంటి అనుమతి ఇవ్వలేదన్నారు. అదేవిదంగా తుళ్ళూరు సబ్ డివిజన్ పరిధిలో అసెంబ్లీ, హైకోర్టు ఇతర ముఖ్య ప్రభుత్వ సముదాయాలున్నందున 30 పోలీసు చట్టంతో పాటు సెక్షన్ 144 అమలులో ఉందన్నారు. ఎవరైనా పోలీస్ ఆదేశాలను ధిక్కరించి కార్యక్రమంలో పాల్గొంటే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ తుషార్ డూడి హెచ్చరించారు.

జీఎంసీ వైఫల్యంతోనే డయేరియా మరణాలు

- టీడీపీ పశ్చిమ నియోజకవర్గ నేత డాక్టర్ నిమ్మల శేషయ్య
- జీజీహెచ్‌లో బాధితులకు పరామర్శ



డయేరియా బాధిత మహిళను పరామర్శిస్తున్న డాక్టర్ నిమ్మల శేషయ్య

గుంటూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): నగరపాలకసంస్థ వైఫల్యంతోనే డయోరియావ్యాధి విజృంభించి ప్రజల ప్రాణాలను బలిగొందని టీడీపీ పశ్చిమ నియోజకవర్గనేత డాక్టర్ నిమ్మల శేషయ్య ఆరోపించారు. డయేరియా బారిన పడి జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న బాధితులను బుధవారం ఆయన పరామర్శించారు. వారికి అందుతున్న చికిత్స వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ ఏకుల కిరణ్‌కుమార్‌ను కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలో డయేరియా మరణాలకు కార్పొరేషన్ అధికారులే నైతిక బాధ్యత వహించాల న్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి రజిని డయోరియా బాధితులకు చికిత్స అందించడంలో విఫలమయ్యారన్నారు. మృతుల కుటుంబాలకు, బాధితులకు తగిన నష్ట పరిహారం అందజేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మతిస్థిమితం లేని మహిళ అదృశ్యం

గుంటూరు, ఫిబ్రవరి 21 : జీజీహెచ్ నుంచి మతిస్థిమితం లేని మహిళ అఆదృశ్యమైంది. ఈ నెల 19న పెదపరిమి గ్రామ పరిధిలోని జగనన్న కాలనీకి చెందిన నూతలపాటి లక్ష్మీ(42)కి మతిస్థిమితం సరిగా లేకపోవడంతో తండ్రి ఈనెల 19న జీజీహెచ్‌కు తీసుకొని వచ్చి ఓపి చీటీ రాయిస్తుండగా లక్ష్మీ ఎటో వెళ్లిపోయింది. ఎంత వెతికినా కనబడలేదు. దీంతో తండ్రి ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు కొత్తపేట సీఐకి 8688831320లో గానీ, పోలీసు స్టేషన్‌కు 0863 - 2221815లో తెలియజేయాలని పోలీసులు కోరారు.

ఐపీడీ కాలనీలో చోరీ

గుంటూరు, ఫిబ్రవరి 21 : స్థానిక లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐపీడీ కాలనీలో తాళం వేసిన ఇంటిలో చోరీ జరిగింది. ఐపీడీ కాలనీకి చెందిన పాదర్తి జయకృష్ణ తన కుటుంబంతో ఈ నెల 19న ఇంటికి తాళం వేసి తిరుపతి వెళ్ళారు. బుధవారం ఇంటికి వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉన్నాయి. ఇంటిలో చూడగా బీరువా తాళాలు పగలగొట్టి అందులో ఉన్న ఒక నెక్లెస్, రెండు చెవిదిద్దులు, వెండి వస్తువులు, రూ.3లక్షల నగదు అపహరించుకుపోయారు. బాధితుడు జయకృష్ణ ఫిర్యాదు మేరకు లాలాపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించింది.

దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి

- గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి

తెనాలి రూరల్, ఫిబ్రవరి 21: అనంతపురం రాప్తాడులో వైసీపీ పార్టీ సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిచేసిన వైసీపీకి చెందిన రౌడీ మూకలపై కేసులు నమోదు చేసి వారిని కఠినంగా శిక్షించాలని గణేష్‌యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నాయకులు వీరవల్లి మురళి అన్నారు. బుధవారం అంగలకుదురులో ఆయన మాట్లాడుతూ ప్రజలకు మంచిచేసి ఎన్నికల్లో గెలవలేక వాస్తవాలను చూపించే పత్రికా విలేకరులపై జగన్ ప్రభుత్వం దాడులకు తెరలేపిందన్నారు. విలేకరులను భయపెడితే సభ్యసమాజంలో నిజాలు వెలుగులోకి రాలేవన్నారు. జగన్ తన ఐదేళ్ల పాలనలో ప్రజలందరికీ మంచి చేశానని చెప్పటం మినహా ఆ తరహాగా ముందుకు నడిచిందిలేదన్నారు. నాలుగేళ్ల రాష్ట్రంలో పాలనను గాలికి వదిలేసి ప్యాలెస్‌కు పరిమితమైన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని ఆరోపించారు. ఆర్థికనేరాల్లో ముద్దాయిగా ఉన్న జగన్ ఈసారి జరిగే ఎన్నికల్లో ఓటమిపాలైతే జైలుకెళ్లడం ఖాయమని భావించి తిరిగి ప్రజల్లోకి వస్తూ సభల ద్వారా చేయని మంచిని చేసినట్లు చెప్పుకుంటూ ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు తాపత్రయపడుతున్నాడని ఆక్షేపించారు. సిద్ధం సభ పేరిట చేయని అభివృద్ధిని చేసినట్లు చెబుతూ ప్రజలను తన మాటలతో మోసగించేందుకు చేస్తున్న ప్రయత్నాలను విలేకరులు ఎక్కడ బయటపెడతారోనన్న భయంతో వారిని కట్టడిచేసేందుకు దాడుల సంస్కృతికి జగన్‌ప్రభుత్వం దిగజారిందని ఆవేదన వ్యక్తం చేశారు. విలేకరులకు ప్రభుత్వం వెంటనే రక్షణ చట్టాలను ఏర్పాటు చేయకపోతే ప్రజాస్వామ్యంలో నిజాలు నిర్భయంగా రాసే జర్నలిస్టులు కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. ఏది ఏమైనా జర్నలిస్టులపై దాడులు నీచమైన చర్య అని మరో ఘటన జరగకముందే దాడికి పాల్పడిన వారిని చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని వీరవల్లి మురళి డిమాండ్ చేశారు.

ప్రభుత్వ కళాశాలలో మెరుగైన విద్యా బోధన

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి21: ప్రభుత్వ ఇంటర్ కళాశాలలో మెరుగైన విద్యాబోధన అందిస్తున్నామని ఇంటర్మీడియేట్ రీజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫసర్ షేక్ జుబేర్ అన్నారు. మండల పరిధిలోని వెల్లలూరు గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్ +2లో బుధవారం ఇంటర్‌మీడియట్ ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమానిన నిర్వహించారు. ముఖ్యఅతిధిగా హాజరైన జుబేర్ మాట్లాడుతూ. ఇంటర్‌మీడియట్‌లో సీఈసీ, బైపీసీ గ్రూప్‌లు ఈ ఏడాది నిర్వహిస్తుండగా వచ్చే ఏడాది వెల్లలూరులో ఎంపీసీ గ్రూప్ ప్రవేశపెట్టేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు ప్రభుత్వ కళాశాలలపై ఉన్న అపోహలు విడనాడి తమ పిల్లల్ని ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలని కోరారు.

కాంగ్రెస్ నాయకులకు పోలీసుల నోటీసులు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 21: సచివాలయ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులను పోలీసులు హౌస్ అరెస్టు చేసేందుకు చర్యలు చేపట్టారు. గురువారం సచివాలయం ముట్టడి నిర్వహించనున్న నేపథ్యంలో తెనాలి నియోజకవర్గ కాంగ్రెస్ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడుకు వన్ టౌన్ సీఐ దశరథ రామారావు బుధవారం నోటీసు అందజేశారు. సచివాలయం ముట్టడికి అనుమతి లేనందున సదరు కార్యక్రమానికి హాజరు కావద్దంటూ ఆయనతోపాటు పలువురు కాంగ్రెస్ నేతలు నోటీసులు ఇచ్చారు.

10 ఇసుక రీచ్‌లకు అనుమతి

- పల్నాడులో ఆరు, గుంటూరులో నాలుగు
- మాన్యువల్‌గానే ఇసుక తీయాలని నిబంధన
- యంత్రాల వినియోగాన్ని అధికారులు అరికట్టేనా?



గుంటూరు, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో కొత్తగా 10 ఇసుక రీచ్‌లకు పర్యావరణ అనుమతులు లభించాయి. ఇటీవల జరిగిన స్టేట్ ఎన్విరాన్‌మెంట్ ఇంపాక్ట్ ఎసెస్‌మెంట్ అథారిటీ ఆంధ్ర ప్రదేశ్(ఎస్‌ఈఐఏఏ ఏపీ) సమావేశంలో అనుమ తులపై నిర్ణయాన్ని తీసుకున్నది. వాటిల్లో ప్రస్తుత పల్నాడు జిల్లాలో ఆరు, గుంటూరులో నాలుగు రీచ్ లున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి. అయితే ఇసుక తవ్వకాలన్నీ మాన్యువల్ పద్ధతిలోనే జరపాలని షరతు పెట్టింది. అది కూడా ఏడాది మాత్రమే ఈ అనుమతులు అమలులో ఉంటాయని పేర్కొన్నది. పల్నాడులో ఈసీలను అక్కడి ఏడీ, గుంటూరులో డీడీ పేరు మీద మంజూరు చేసింది. ఈ నెల 7 నుంచే అనుమతులు జారీ అయ్యాయి. పల్నాడు జిల్లాలో అమరావతి మండలం దిడుగులో 4.930 హెక్టార్లు, పొందుగు లలోని సర్వే నెంబరు.2లో 4.860 హెక్టార్లు, అచ్చంటపేట మండలం లోని డీ కోనూరులో సర్వే నెంబరు.331లో 3.930 హెక్టార్లు, అంబడి పూడిలోని సర్వేనెంబరు.1లో 4.830 హెక్టార్లు, అంబడిపూడి-1లో 4.830 హెక్టార్లు, అంబడిపూడి-2లో 4.840 హెక్టార్లలో ఇసుక తవ్వ కాలకు ఈసీ అనుమతులను మంజూరుచేసింది. ప్రస్తుత గుంటూరు జిల్లా లోని కొల్లిపర మండలం మున్నంగిలో సర్వే నెంబరు.661లో 4.886 హెక్టార్లు, తాడేపల్లి మండలం గుండిమెడలో 4.971 హెక్టార్లు, కొల్లిపర మండలం బొమ్మువానిపాలెంలో 4.840హెక్టార్లు, బొమ్ము వానిపాలెం -15లో సర్వే నెంబరు 128లో 4.80 హెక్టార్లలో అనుమతులు వచ్చాయి. ఆయా గ్రామాల్లోని సర్వే నెంబర్లలో మాత్రమే ఇసుకని మాన్యువల్ పద్ధతిలో తవ్వేందుకు గనులశాఖ అనుమతులు మంజూరు చేయాలి. ఎన్‌జీటీ ఉత్తర్వులకు లోబడి ఈ అనుమతులు వచ్చినందున ఎలాంటి యంత్రాలను ఇసుక తవ్వకాలకు వినియోగించరాదు.

మాన్యువల్ పద్ధతిలో జరిగేనా.. మాన్యువల్ పద్ధతిలోనే ఇసుక తవ్వకాలు చేపట్టాలని ఎస్‌ఈఐఏఏ ఏపీ ఈసీలను మంజూరు చేస్తూ స్పష్టంగా పేర్కొన్నది. అయితే జిల్లాలో మాన్యువల్ పద్ధతికి స్వస్తి చెప్పి ఎన్నో ఏళ్లు అయింది. ఇప్పుడు అంతా యంత్రాలమయమే. డ్రెడ్జర్లు, ఎక్స్‌కవేటర్లు పెట్టి ఇసుకని తోడి లారీలు, టిప్పర్లలోకి నింపుతున్నారు. మాన్యువల్ పద్ధతి లో అయితే ఒక్కో రీచ్‌లో రోజుకు కనీసం 20 లారీలు కూడా లోడింగ్ చేయలేరు. ఈనేపథ్యంలో దొంగచాటుగా యంత్రాలు వినియోగిస్తూనే ఉంటారు. దీనిని మైనింగ్ అధికారులు ఏవిధంగా అరికడతారో చూడాలి.

ఓటరు దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి

- కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి
- రాజకీయపార్టీల ప్రతినిధులతో సమీక్ష



రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో పాల్గొన్న కలెక్టర్

గుంటూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్ని రకాల ఓటరు దరఖాస్తులను ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం క్షేత్రస్థాయిలో సక్రమంగా విచారించి ఈఆర్వోలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితాలు, దరఖాస్తుల పరిష్కారంపై రాజకీయ పార్టీల ప్రతినిధులు తెలిపిన అంశాలు, అభ్యంతరాలను ఈఆర్వోలు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థుల అవగాహన కోసం ఎన్నికల సంఘం ఈవీఎంలు, వీవీప్యాట్‌లు పని చేసే విధానం, భద్రత ఫీచర్లపై అవగాహనకోసం రూపొందించిన మెటీరియల్‌ను రాజకీయపార్టీల ప్రతినిధులకు అందించటం జరుగుతుందన్నారు. వీటిని పూర్తిస్థాయిలో పరిశీలించాలన్నారు. సమావేశంలో డీఆర్వో పెద్ది రోజా, ఆమ్ ఆద్మీ పార్టీ, బీఎస్పీ, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్, టీడీపీల తరపున ఆయా పార్టీల ప్రతినిధులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రవీంద్రరావు, లక్ష్మీకుమారి, జీఎంసీ ఏసీ రాజ్యలక్ష్మీ ఎన్నికల విభాగ అధికారులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ..

జిల్లాలో పేదలందరికీ ఇళ్ళ పథకం స్థలాల రిజిస్ట్రేషన్లలో అలసత్వం వహించే సచివాలయ ఉద్యోగులు, పర్యవేక్షించే నోడల్ అధికార్లపై కఠినచర్యలు తీసుకుంటామని కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరం నుంచి ఆయన పేదలందరికీ ఇళ్ళ పథకం స్థలాల రిజిస్ట్రేషన్, జగనన్న పాలవెల్లువ, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, హౌసింగ్ తదితర అంశాలపై ప్రత్యేక అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సచివాలయ ఉద్యోగులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ జీ.రాజకుమారి, జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా పాల్గొన్నారు.

విలేకరులపై దాడి రాజ్యాంగ ఉల్లంఘనే

- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడిని ఖండిచండి

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 21: రాష్ట్రంలో పత్రికా విలేకరుల మీద జరుగుతున్న దాడులు రాజ్యాంగ ఉల్లంఘన కిందకే వస్తాయని ప్రముఖ న్యాయవాది చిగురుపాటి రవీంద్ర బాబు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్రజ్యోతి దిన పత్రిక ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ శ్రేణులు దాడి చేయటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఇటువంటి సంఘటనలు సమాజంలో ప్రజాస్వామ్యాన్ని బలహీన పరుస్తాయని అన్నారు. దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చిగురుపాటి డిమాండ్ చేశారు.



విద్యార్థులను అభినందిస్తున్న అన్నా నందకిషోర్

సీఎంఏ ఫైనల్, ఇంటర్ ఫలితాల్లో

శ్రీమేధ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు(విద్య),ఫిబ్రవరి 21: ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ప్రకటించిన సీఎంఏ ఫైనల్, ఇంటర్ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించారని ఛైర్మన్ అన్నా నందకిషోర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ విద్యార్థులు పీ.లోకేష్ జాతీయస్థాయిలో 4వ ర్యాంకు, చందా పవన్‌కుమార్ 17వ ర్యాంకు, ఏ. పవన్‌కళ్యాణ్ 31, డీ. శ్రీహరిరెడ్డి 47వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. అదే విధంగా సీఎంఏ ఇంటర్‌లో బొల్లా పల్లవి 27వ ర్యాంకు సాధించినట్లు వెల్లడించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఛైర్మన్ అన్నా నందకిషోర్, డైరెక్టర్ శ్రీలక్ష్మీ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

మాతృభాషను కాపాడుకుందాం..

గుంటూరు, ఫిబ్రవరి 21: మాతృభాషను కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజంలో అందరిపై ఉందని సంగీత విద్వాంసులు వీఎస్ఎన్ మల్లేశ్వరరావు తెలిపారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాతృభాష పరిరక్షణ కోసం అంతర్జాతీయంగా విశేష కృషి జరగాల్సి ఉందని అన్నారు. ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా అనేక భాషలు తమ అస్తిత్వాన్ని కోల్పోతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. వివిధ రాష్ట్రాల్లో ప్రజలు మాట్లాడే భాషలను చులకన చేయటం సరికాదన్నారు. పాఠశాల స్థాయిలో కొంత మేరకైనా మాతృభాషలో విద్యాబోధన కొనసాగాలన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, ఆర్‌వీ సింగరయ్య, ఎ హరి, సదాశివం, నారాయణ పాల్గొన్నారు.



'భువన విజయం' ప్రదర్శిస్తున్న విద్యార్థినీ, విద్యార్థులు

ఆకట్టుకున్న 'భువన విజయం'

- కేఎస్‌ఆర్టీ మునిసిపల్ పాఠశాల విద్యార్థుల పదర్శన

గుంటూరు(తూర్పు),ఫిబ్రవరి21: విద్యార్థులు పదర్శించిన 'భువన విజయం' పద్య నాటిక వీక్షకులను ఆకట్టుకుంది. బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా స్థానిక బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై విద్యార్థులు నాటిక పదర్శన ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోషియేషన్ మహిళా విభాగం, గుళ్ళపల్లి సుబ్బారావు సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన నిర్వహించగా, స్థానిక కేవీపీ కాలనీలోని కేఎస్‌ఆర్టీ మునిసిపల్ హైస్కూల్ విద్యార్థులు తమ అభినయం, చక్కటి పద్యాలతో అలరించారు. కార్యక్రమంలో డాక్టర్ మాదవపెద్ది విజయలక్ష్మి, డాక్టర్ మైలవరపు లలితకుమారి, డాక్టర్ ఎన్.సిహెచ్. మైథిలీ, అంచె విజయలక్ష్మి లంకా విజయబాబు, గుళ్ళపల్లి సుబ్బారావు పాల్గొని విద్యార్థులను అభినందించి సత్కరించారు.



స్వామి వారికి సేవలు నిర్వహిస్తున్న వేదపండితులు

అంగరంగ వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి21: స్థానిక బ్రాడీపేట, ఓంకారక్షేత్రం పాలకమండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 90వ శ్రీరామనామ సప్తాహ మహోత్సవాల లో భాగంగా బుధవారం ఉదయం నిత్య పూజలు, శ్రీరామ పట్టాభిషేక మహోత్సవ సందర్భంగా సీతారామ లక్ష్మణ, ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేకాలంకరణాలు చేసి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం పూజలలో పాల్గొన్న వేద పండితులు, భక్తులు శ్రీ రామ పాదుకలను తలపై ఉంచి ఆలయ ప్రదక్షణ చేశారు. సాయంత్రం సీతారామ పరివారంతో పుర వీధులలో జరిగిన నగరోత్సవం వైభవంగా జరిగింది.

కాలేయ, జీర్ణకోశ వ్యాధులకు అత్యాధునిక వైద్యం

- సుప్రసిద్ధ గ్యాస్ట్రో ఎంటిరాలజిస్ట్ డాక్టర్ డీ.నాగేశ్వర్‌రెడ్డి
- సిద్ధార్థ గ్యాస్ట్రోకేర్ హాస్పిటల్ ప్రారంభం
- డాక్టర్ ఆళ్ల సిద్ధార్థ రెడ్డికి ప్రముఖుల అభినందన



ఎండోస్కోపీ యూనిట్‌లో నాగేశ్వర్‌రెడ్డి, సిద్ధార్థ రెడ్డి, తదితరులు

గుంటూరు (మెడికల్) ఫిబ్రవరి 21: కాలేయ, జీర్ణకోశ వ్యాధులకు సబంధించి అత్యాధునిక పరికరాలతో గుంటూరులో పూర్తిస్థాయి వైద్యం అదించేందుకు గ్యాస్ట్రో కేర్ హాస్పిటల్ అందుబాట్లోకి రావడం సంతోషదాయకమని ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటిరాలజీ ఛైర్మన్, సుప్రసిద్ధ గ్యాస్ట్రో ఎంటిరాలజిస్ట్ డాక్టర్ డీ.నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం గుంటూరువారితో మొదటి లైన్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన సిద్ధార్థ గ్యాస్ట్రోకేర్ హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేయగా, డాక్టర్ డీ.నాగేశ్వర్‌రెడ్డి హాస్పిటల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ సిద్ధార్థరెడ్డి ప్రతిభావంతుడైన వైద్యుడని, పేద, మధ్య తరగతి ప్రజలకు చక్కటి వైద్యసేవలు అందించాలని ఆకాంక్షించారు. హాస్పిటల్ అధినేత, మెడికల్ గ్యాస్ట్రో ఎంటిరాలజిస్ట్ డాక్టర్ ఆళ్ల సిద్ధార్థ రెడ్డి మాట్లాడుతూ సిద్ధార్థ గ్యాస్ట్రో కేర్ హాస్పిటల్‌లో అన్ని రకాల జీర్ణకోశ, కాలేయ వ్యాధులకు అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. అత్యవసర కేసులకు 24 గంటలూ వైద్య సేవలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో ఏపీ క్రెడాయ్ ఛైర్మన్ ఆళ్ల శివారెడ్డి, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎమ్మెల్యేలు మద్దాళి గిరిధర్, మహమ్మద్ ముస్తఫా, మేకతోటి సుచరిత, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, మైనార్టీ వ్యవహారాల సలహాదారుడు ఎస్ఎం జియావుద్దీన్, వైసీపీ నేత నూరి ఫాతిమా, డాక్టర్ బూసిరెడ్డి నరేంద్ర రెడ్డి, వైద్యులు పాల్గొని ఆళ్ల సిద్ధార్థ రెడ్డికి అభినందనలు తెలిపారు.

రెండు రోజులపాటు నీటి సరఫరా నిలిపివేత

- హెడ్ వాటర్ వర్క్సులో మరమ్మతులు రేపటికి వాయిదా

గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవరి21 :గుంటూరు నగరంలో తక్కెళ్ళపాడు హెడ్ వాటర్ వర్క్సులోని 45 ఎంఎల్డీ ఫిల్టరేషన్ ప్లాంట్‌ను వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం నీటి సరఫరా నిలుపుదల చేయనున్నట్లు నగరపాలక సంస్థ ఇన్‌చార్జి ఎస్.ఈ. సుందరరామిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం నుండి శనివారం ఉదయం వరకు నగరంలోని రాజీవ్‌గాంధీనగర్, వసంత రాయపురం, హనుమయ్య నగర్, నెహ్రూనగర్, శారదా కాలని రిజర్వాయర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు పాక్షికంగా అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. ప్రజలు గమనించి నగర పాలక సంస్థకు సహకరించి ముందుగా తగిన ఏర్పాట్లు చేసుకొనవలసినదిగా ఇన్‌చార్జి ఎస్‌ఈ సుందరరామిరెడ్డి కోరారు.



మరమ్మతులను పరిశీలిస్తున్న మేయర్ మనోహర్ నాయుడు

అంతరాయం లేకుండా తాగునీరు సరఫరా

- నగర మేయర్ మనోహర్ నాయుడు.. రిజర్వాయర్ల క్లీనింగ్ పరిశీలన

గుంటూరు(కార్పొరేషన్), ఫిబ్రవ21: నగర ప్రజలకు తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా సూచేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు తెలిపారు. బుధవారం హెడ్ వాటర్ వర్క్స్, బీఆర్ స్టేడియం, నల్లచెరువు రిజర్వాయర్ల క్లీనింగ్‌ను మేయర్ నేరుగా పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రానున్న వేసవి దృష్ట్యా స్వచ్ఛమైన తాగునీటిని సరిపడా సరఫరా చేయుటకు, నగరంలోని తాగునీటి రిజర్వాయర్లు, సంపుల క్లీనింగ్, మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టామన్నారు. తాగునీటి పైప్ లైన్లకు ఏర్పడిన లీకులను గుర్తించి తక్షణం మరమ్మతులు నిర్వహించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. తక్కెళ్ళపాడు హెడ్ వాటర్ వర్క్సులోని 42 ఎంఎల్‌డీ ప్లాంట్, నగరంలోని శ్రీనివాసరావుపేట, నల్లచెరువు, బీఆర్ స్టేడియం, తారకరామ నగర్, ఐపీడీ కాలనీ, ఆటోనగర్, ఏటుకూరు ప్రాంతాల్లోని రిజర్వాయర్లను, సంపులను యుద్ధ ప్రాతిపదికన శుభ్రం చేయించామన్నారు. తాగునీటి సరఫరాపై ఫిర్యాదు రాకూడదని, ఏమైనా ఫిర్యాదులు అందినట్లయితే, వెంటనే స్పందించి దానిని యుద్ధ ప్రాతిపదికపై పరిష్కరించాలన్నారు. సమస్యల పరిస్కారంలో, తాగునీటి సరఫరాలో అలసత్వం వహింస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో యస్‌ఈ లు సుందర రామిరెడ్డి, జె.శ్రీనివాస్, కోటేశ్వరరావు, డీ.ఈ.ఈ హనీఫ్, శ్రీధర్, ఏ.ఈ లు ఇతర ఇంజనీర్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న రైల్వే మహిళ సంక్షేమ సంఘం అధ్యక్షురాలు ఆశలత

రుతు క్రమంలో పరిశుభ్రత పాటించాలి

- రైల్వే మహిళ సంక్షేమ సంఘం అధ్యక్షురాలు ఆశలత

గుంటూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మహిళలు రుతక్రమంలో వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని గుంటూరు రైల్వే డివిజన్ మహిళ సంక్షేమ సంఘం అధ్యక్షురాలు ఎం.ఆశలత సూచించారు. బుధవారం పట్టాభిపురంలోని రైల్ వికాస్ భవన్‌లో రుతు పరిశుభ్రతపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆశలత మాట్లాడుతూ రుతు క్రమంలో మంచి ఆరోగ్య పద్ధతులు పాటించడం ద్వారా వ్యాధులు, దుర్గంధం రాకుండా చూసుకోవచ్చన్నారు. అంతేకాకుండా రుతుక్రమం సమయంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా సౌకర్యవంతంగా ఉండొచ్చన్నారు. ముఖ్యంగా రెస్టు రూంకి వెళ్లే ముందు, బయటకు వచ్చిన తర్వాత చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. అనంతరం సదస్సుకు హాజరైన మహిళలకు పర్యావరణహిత నేప్‌కిన్స్‌ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో గైనకాలజిస్టు, అసిస్టెంట్ డివిజనల్ రైల్వే మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక, సెక్రెటరీ అఖిల, షర్మిల, లత, కల్పన పాల్గొన్నారు.



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న పీకేఎస్ రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి

కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేయాలి

- ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి బీ.కొండారెడ్డి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి21: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పనిచేసే కార్మికులకు థర్డ్ పార్టీ కాంట్రాక్ట్ విధానాన్ని రద్దుచేసి నేరుగా విశ్వవిద్యాలయమే జీతాలు చెల్లించాలని ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి బీ.కొండారెడ్డి డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం కాంట్రాక్టు కార్మికులు లాం, విశ్వవిద్యాలయం వద్ద బుధవారం నిరసన దీక్ష చేపట్టారు. వారి ఆందోళనకు మద్దతు తెలిపిన కొండారెడ్డి మాట్లాడుతూ అగ్రికల్చరల్ యూనివర్సిటీలో పనిచేసే కార్మికులకు ఉద్యోగభద్రత లేకపోవడం బాధాకరమన్నారు. కార్మిక శాఖ చట్టాల ప్రకారం వేతనంతో కూడిన తొమ్మిది రోజుల జాతీయ పండుగ సెలవు దినాలను అమలు పరచాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులు ప్రకారం కార్మికులు సహజ మరణానికి రూ. 2 లక్షలు, ప్రమాద మరణానికి రూ.5 లక్షలు పరిహారం చెల్లించే విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కేఎస్ కోటేశ్వరరావు, మందా రాజేష్, నామతోటి రాణి, నాగలక్ష్మి, కార్యదర్శి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు 50 శాతం ఐఆర్ మంజూరు చేయాలి

గుంటూరు, ఫిబ్రవరి 21: రాష్ట్రంలోని 4 లక్షల మంది పెన్షనర్లకు 50 శాతం మధ్యంతర భృతి మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని వినతిపత్రం ద్వారా కోరినట్లు రాష్ట్ర పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య తెలిపారు. కొత్త పీఆర్‌సీ కమిషనర్‌ను నియమించినప్పటికీ కార్యాలయం ఏర్పాటు, సిబ్బంది నియామకం జరగలేదన్నారు. పాత పీఆర్‌సీ అమలు పరచనప్పటికి దాని ప్రయోజనాలు సంపూర్ణంగా పెన్షనర్‌లకు, ఉద్యోగులకు అందలేదన్నారు. అనేక సార్లు ఉద్యోగ సంఘాలు పలు విజ్ఞప్తులు చేసినప్పటికీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని తమ కోరికలను తిరస్కరిస్తూనే ఉన్నార న్నారు. గతంలో పీఆర్‌సీ నివేదికలో వున్న ప్రకారం కాకుండా ఫిట్‌మెంట్ తగ్గించారన్నారు. అదనపు పెన్షన్ స్లాబులను మార్చారని, దీంతో ఉద్యో గులు, పెన్షనర్లు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ఉద్యోగులను, పెన్షనర్ల ఆగ్రహాన్ని చల్లబరిచేందుకు 50 శాతం మధ్యంతర భృతిని మంజూరు చేయాలని ఈదర వీరయ్య ప్రభుత్వాన్ని కోరారు.

దిక్సూచి
DIKSUCHI

ఐఐటీ హైదరాబాద్‌లో స్యూర్ ఇంటర్న్‌షిప్

హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)- 'సమ్మర్ అండర్‌గ్రాడ్యుయేట్ రీసెర్చ్ ఎక్స్‌ప్లోజర్(స్యూర్)' ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి కనిష్ఠంగా ఒక నెల, గరిష్ఠంగా రెండు నెలలు ఉంటుంది. అభ్యర్థులు ఫుల్ టైమ్ వర్క్ చేయాల్సి ఉంటుంది. పార్ట్ టైమ్/ఆన్‌లైన్ విధానాలు లేవు. మొత్తం 200 సీట్లు ఉన్నాయి. వీటిలో 50 సీట్లను అమ్మాయిలకు కేటాయించారు. ఈ ప్రోగ్రామ్ పూర్తిగా ఉచితం. స్టయిపెండ్ కూడా ఇస్తారు. ఎంపికైనవారికి ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో వసతి సౌకర్యం కల్పిస్తారు. అభ్యర్థులు మెస్ ఛార్జీలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. బేసిక్ మెడికల్ సర్వీస్ అందిస్తారు.

విభాగాలు

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, బయోమెడికల్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, డిజైన్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, లిబరల్ ఆర్ట్స్, ఆంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్, మెటీరియల్స్ సైన్స్ అండ్ మెటలర్జికల్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్, సస్టయినబిలిటీ, క్లయిమేట్ ఛేంజ్, హెరిటేజ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇంటర్‌డిసిప్లినరీ ప్రోగ్రామ్, ఫిజిక్స్, మెకానికల్ అండ్ ఏరోస్పేస్ ఇంజనీరింగ్ విభాగాలు ఉన్నాయి. వీటికి నిర్దేశించిన పరిశోధనాంశాలను వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

అర్హత

ఎమ్మెస్సీ(మేథ్స్/ఫిజిక్స్/కెమిస్ట్రీ/బయాలజీ)/ఎంఏ మొదటి ఏడాది చదువుతున్నవారు; బీటెక్(అన్ని విభాగాలు)/బీడిజైన్‌కు సంబంధించి రెండో ఏడాది/మూడో ఏడాది చదువుతున్నవారు; ఇంటిగ్రేటెడ్ బీటెక్-ఎంటెక్ ప్రోగ్రామ్‌నకు సంబంధించి మూడో ఏడాది/నాలుగో ఏడాది చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇప్పటి వరకు పూర్తయిన సెమిస్టర్ ఎగ్జామ్స్‌లో అభ్యర్థులు నిర్దేశిత సీజీపీఏ స్కోర్‌లో టాప్ 20 శాతం సాధించి ఉండాలి. ఫుల్ టైమ్/రెగ్యులర్ అభ్యర్థులు మాత్రమే అర్హులు. ఐఐటీ హైదరాబాద్‌కు చెందిన అభ్యర్థులు ఈ ప్రోగ్రామ్‌నకు అనర్హులుగా ప్రకటించారు.

ఎంపిక

ప్రిలిమినరీ స్క్రీనింగ్ ద్వారా సెలెక్ట్ చేసిన అభ్యర్థులకు ఆన్‌లైన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.



స్టయిపెండ్

అభ్యర్థులు ఒక నెల, నెలన్నర, రెండు నెలల వ్యవధిని ఎంచుకోవచ్చు. నెల ప్రోగ్రామ్‌నకు రూ.7,500; నెలన్నర ప్రోగ్రామ్‌నకు రూ.10,000; రెండు నెలల ప్రోగ్రామ్‌నకు రూ.15,000లను స్టయిపెండ్ కింద చెల్లిస్తారు.

- **ప్రోగ్రామ్ వ్యవధి:** 2024 మే 15 నుంచి జూలై 14 వరకు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 10
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** ఏప్రిల్ 15
- **వెబ్‌సైట్:** iith.ac.in, https://iith.ac.in/research/SURE/

ఏపీ పాలిసెట్

ఆంధ్రప్రదేశ్-మంగళగిరిలోని స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెయినింగ్(ఎస్‌బీటీఈటీ)- 'పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పాలిసెట్) 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.



విభాగాలు

మూడేళ్ల కోర్సులు: సివిల్, ఆర్కిటెక్చరల్ అసిస్టెంట్‌షిప్, మెకానికల్, ఆటోమొబైల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రిక్ వెహికల్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, కంప్యూటర్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, 3డీ యానిమేషన్ అండ్ గ్రాఫిక్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్), క్లౌడ్ కంప్యూటింగ్ అండ్ బిగ్ డేటా, కమ్యూనికేషన్ అండ్ కంప్యూటర్ నెట్ వర్కింగ్, మైనింగ్, కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్, అప్పారెల్ డిజైన్ అండ్ ఫ్యాషన్ టెక్నాలజీ, మెటలర్జికల్ ఇంజనీరింగ్, టెక్స్‌టైల్ టెక్నాలజీ.

మూడున్నరేళ్ల కోర్సులు: బయో మెడికల్, కెమికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్(ఆయిల్ టెక్నాలజీ/పెట్రో కెమికల్స్/ప్లాస్టిక్ అండ్ పాలిమర్స్/షుగర్ టెక్నాలజీ), సిరామిక్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, ప్యాకేజింగ్ టెక్నాలజీ

అర్హత: తెలుగు రాష్ట్రాలకు చెందిన స్టేట్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(ఎస్ఎస్సీ), సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ), ఇండియన్ కౌన్సిల్ ఫర్ సెకండరీ ఎడ్యుకేషన్(ఐసీఎస్ఈ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్(ఎన్ఐఓఎస్), ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ(ఏపీఓఎస్ఎస్), ఇతర రాష్ట్రాల బోర్డుల నుంచి మేథమెటిక్స్ ఒక సబ్జెక్టుగా పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం పరీక్షలు రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

ఏపీ పాలిసెట్ వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు. ఇందులో మేథమెటిక్స్ నుంచి 50, ఫిజిక్స్ నుంచి 40, కెమిస్ట్రీ నుంచి 30 చొప్పున మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ ఏపీ స్టేట్ బోర్డు రూపొందించిన పదోతరగతి సిలబస్ ఆధారంగానే ఉంటాయి. సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. నెగెటివ్ మార్కులు లేవు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 120. లాగ్ టేబుల్స్, క్యాలిక్యులేటర్స్, పేజర్స్, సెల్‌ఫోన్‌లను పరీక్ష హాల్‌లోకి అనుమతించరు. ప్రశ్నపత్రం తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.400; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ100
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 5
- **ఏపీ పాలిసెట్ 2024 తేదీ:** ఏప్రిల్ 27
- **ఫలితాలు విడుదల:** మే 13
- **వెబ్‌సైట్:** polycetap.nic.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/2N5NZ6nలో చదవండి.



సన్నిహితుల సమక్షంలో
రకుల్ వివాహం

హీరోయిన్ రకుల్ ప్రీత్‌సింగ్ వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. తన చిరకాల మిత్రుడు, నిర్మాత జాకీ భగ్నానీతో ఆమె వివాహం గోవాలోని ఐటీసీ గ్రాండ్ రిసార్ట్స్‌లో బుధవారం జరిగింది. ఉదయం సిఖ్ పద్ధతి ప్రకారం, సాయంత్రం సింధి సంప్రదాయ పద్ధతిలో జరిగిన వీరి వివాహ వేడుకలో కుటుంబ సభ్యులు, సన్నిహితులు మాత్రమే పాల్గొన్నారు. బాలీవుడ్ నుంచి అక్షయ్‌కుమార్, వరుణ్ ధావన్, జెనీలియా, టైగర్ ష్రాఫ్, శిల్పా శెట్టి, రాజ్ కుంద్రా, అర్జున్ కపూర్, ఆయుష్మాన్ ఖురానా తదితరులు హాజరయ్యారు.



'బినాకా గీత్ మాలా' అమీన్ సయానీ ఇక లేరు!

'బెహనో ఔర్ భాయియో' అంటూ 42 ఏళ్ల పాటు సిలోన్ రేడియోలో, ఆ తర్వాత వివిధ భారతిలోనూ 'బినాకా గీత్ మాలా' కార్యక్రమంతో హిందీ సినీ గీతాల మాలతో శ్రోతలను అలరించిన స్వరం మూగబోయింది. రేడియో అనౌన్సర్లకు, జాకీలకు పితామహుడు లాంటి అమీన్ సయానీ తన 91 ఏట గుండెపోటుతో బుధవారం ముంబైలో కన్నుమూశారు. ఆయన సమర్పించే 'బినాకా గీత్ మాలా' వినడం కోసం ఆ రోజుల్లో ప్రతి బుధవారం అంతా రేడియో ముందు చేరిపోయేవారు. ఈ కార్యక్రమంలో ప్రసారం చేసే పాట గురించి మధ్య మధ్యలో ఆయన చేసే వివరణ చాలా ఆసక్తికరంగా ఉండేది. 'బినాకా గీత్ మాలా' మాత్రమే కాకుండా క్విజ్ ప్రోగ్రామ్, షాలీమార్ సూపర్ జోడీ, 'సంగీత్ కే సితారే' వంటి కార్యక్రమాలు ఆయన నిర్వహించారు. 54 వేల రేడియో కార్యక్రమాలు నిర్వహించిన రికార్డ్ సృష్టించిన అమీన్ సయానీ 2009లో పద్మశ్రీ పురస్కారం పొందారు. ఇప్పటివరకూ పద్మశ్రీ పురస్కారం పొందిన రేడియో అనౌన్సర్ అమీన్ సయానీ మాత్రమే. అలాగే 'భూత్ బంగ్లా', 'బాక్సర్', 'ఖతాల్' వంటి చిత్రాల్లో అమీన్ నటించి, అనౌన్సర్ పాత్రలనే పోషించడం విశేషం.



వేడుకగా దాదాసాహెబ్ ఫాల్కే
అవార్డుల ప్రదానం



భారతీయ సినీరంగంలో ప్రతిష్ఠాత్మకంగా భావించే దాదాసాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ 2024 మంగళవారం రాత్రి ముంబైలో కన్నుల పండుగగా జరిగింది. పలువురు సినీతారలు ఈ చిత్రోత్సవంలో సందడి చేశారు. 'యానిమల్' చిత్రానికి గాను సందీప్‌రెడ్డి వంగా ఉత్తమ దర్శకుడి పురస్కారం అందుకున్నారు. ఉత్తమ నటీనటులుగా 'జవాన్' చిత్రానికి షారూఖ్, నయనతార అవార్డు స్వీకరించారు. ఉత్తమ ప్రతినాయకుడిగా బాబీడియోల్, ఉత్తమ సంగీత దర్శకుడిగా అనిరుధ్ రవిచందర్ నిలిచారు. సంగీత ప్రపంచానికి అందించిన సేవలకు గాను యేసుదాస్ ప్రత్యేక పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా షారూఖ్‌ఖాన్ మాట్లాడుతూ 'దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు అంటే నాకు చాలా గౌరవం. చాలా ఏళ్ల తర్వాత మళ్లీ ఉత్తమ నటుడి పురస్కారం దక్కినందుకు ఆనందంగా ఉంది. ఈ అవార్డును నాతో పాటు పురస్కారాలకు నామినేట్ అయిన తోటి నటీనటులకు అంకితమిస్తున్నాను. ఇంత గొప్ప గౌరవం దక్కేలా చేసినందుకు ప్రేక్షకులకూ, జవాన్ చిత్రబృందానికి నా ధన్యవాదాలు' అని పేర్కొన్నారు.

సూర్య కెరీర్‌లోనే హై బడ్జెట్ ఫిల్మ్



విభిన్న పాత్రలను పోషించడంలో ఎప్పుడూ ముందుండే తమిళ హీరో సూర్య ప్రస్తుతం పాన్ వరల్డ్ ఫిల్మ్ 'కంగువ'లో నటిస్తున్నారు. మొత్తం పది భాషల్లో విడుదల కానున్న ఈ పీరియాడిక్ యాక్షన్ ఫిల్మ్‌కు శివ దర్శకత్వం వహిస్తున్నారు. స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఇందులో బాబీ డియోల్ కీలక పాత్ర పోషిస్తున్నారు. దిశా పటాని కథానాయిక. ఈ సినిమా డబ్బింగ్ వర్క్ ప్రారంభించారు సూర్య. ఆయన కెరీర్‌లోని హై బడ్జెట్ ఫిల్మ్‌గా రూపొందుతున్న ఈ చిత్రం విడుదల తేదీని త్వరలో ప్రకటిస్తారు. త్రీడీలోనూ 'కంగువ' విడుదల కానుంది.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/EsKRWQ0లో చదవండి.



అన్నాబత్తుని జయలక్ష్మీ,శ్రావణ్‌కుమార్ దంపతులతో మాట్లాడుతున్న పెమ్మసాని

టీడీపీని కలిసికట్టుగా గెలిపించుకుదాం: పెమ్మసాని

తెనాలి రూరల్, ఫిబ్రవరి 21: రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన ఉమ్మడి కూటమిని గెలిపించుకునేందుకు అందరం కలిసికట్టుగా పనిచేద్దామని పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని బుర్రిపాలెంలో పెమ్మసాని చంద్రశేఖర్‌ను జిల్లా పార్లమెంటరీ తెలుగు మహిళా అధ్యక్షురాలు అన్నాబత్తుని జయలక్ష్మి, శ్రావణ్‌కుమార్ దంపతులు కలిసి ఆయనతో ఎన్నికల్లో పార్టీ గెలుపునకు చేపట్టవలసిన కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్నవేళ ప్రజలకు చేరువ అవుతూ పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ కల్పిస్తూ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ఎన్నికలు ఎప్పుడు వచ్చినా విజయం సాధించేలా ముందుకు సాగుదామన్నారు. ఈ ప్రాంతంలోని సమస్యలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టి అధికారం చేపట్టిన వెంటనే వాటిని కూడా పరిష్కరించేలా కార్యాచరణను సిద్ధం చేసుకుందామన్నారు. పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



ఆహారం పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కొనసాగుతున్న అన్న క్యాంటీన్‌లు

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 21: పట్టణంలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌ల సేవలు కొనసాగుతున్నాయని టీడీపీ నాయకుడు, క్యాంటీన్ నిర్వాహక సభ్యుడు అక్కిశెట్టి వెంకటేశ్వరావు తెలిపారు. స్థానిక మార్కెట్ సెంటరులోని అన్న క్యాంటీన్‌లో బుధవారం ఎన్నారై విద్యా సంస్థల యాజమాన్యం సహకారంతో పేదలకు అన్నదానం చేశారు. శివాజి చౌక్‌లో అన్న క్యాంటీన్‌లో ఆలపాటి రాజా దంపతుల సహకారంతో పేదలకు ఆహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సోమవరపు సాంబశివరావు, గోగినేని రమేష్, క్రొత్తపల్లి రమేష్, ముళ్ళపూడి వెంకట్, మాదల కోటేశ్వరరావు, వెల్లంకి సాంబయ్య, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి

● గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి

తెనాలి రూరల్, ఫిబ్రవరి 21: అనంతపురం రాప్తాడులో వైసీపీ పార్టీ సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిచేసిన వైసీపీకి చెందిన రౌడీమూకలపై కేసులు నమోదు చేసి వారిని కఠినంగా శిక్షించాలని గణేష్‌యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నాయకులు వీరవల్లి మురళి అన్నారు. బుధవారం అంగలకుదురులో ఆయన మాట్లాడుతూ ప్రజలకు మంచిచేసి ఎన్నికల్లో గెలవలేక వాస్తవాలను చూపించే పత్రికా విలేకరులపై జగన్ ప్రభుత్వం దాడులకు తెరలేపిందన్నారు. విలేకరులను భయపెడితే సభ్యసమాజంలో నిజాలు వెలుగులోకి రాలేవన్నారు. జగన్ తన ఐదేళ్ల పాలనలో ప్రజలందరికీ మంచి చేశానని చెప్పటం మినహా ఆ తరహాగా ముందుకు నడిచిందిలేదన్నారు. నాలుగేళ్లు రాష్ట్రంలో పాలనను గాలికి వదిలేసి ప్యాలెస్‌కు పరిమితమైన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని ఆరోపించారు. ఆర్థికనేరాల్లో ముద్దాయిగా ఉన్న జగన్ ఈసారి జరిగే ఎన్నికల్లో ఓటమి పాలైతే జైలుకెళ్లడం ఖాయమని భావించి తిరిగి ప్రజల్లోకి వస్తూ సభల ద్వారా చేయని మంచిని చేసినట్లు చెప్పుకుంటూ ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు తాపత్రయపడుతున్నాడని ఆక్షేపించారు. సిద్ధం సభ పేరిట చేయని అభివృద్ధిని చేసినట్లు చెబుతూ ప్రజలను తన మాటలతో మోసగించేందుకు చేస్తున్న ప్రయత్నాలను విలేకరులు ఎక్కడ బయటపెడతారోనన్న భయంతో వారిని కట్టడిచేసేందుకు దాడుల సంస్కృతికి జగన్‌ప్రభుత్వం దిగజారిందని ఆవేదన వ్యక్తం చేశారు. విలేకరులకు ప్రభుత్వం వెంటనే రక్షణ చట్టాలను ఏర్పాటు చేయకపోతే ప్రజాస్వామ్యంలో నిజాలు నిర్భయంగా రాసే జర్నలిస్టులు కనుమరుగయ్యే ప్రమాదం ఉందన్నారు. ఏది ఏమైనా జర్నలిస్టులపై దాడులు నీచమైన చర్య అని మరో ఘటన జరగకముందే దాడికి పాల్పడిన వారిని చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని వీరవల్లి మురళి డిమాండ్ చేశారు.

ఆరోగ్య సురక్షా శిబిరం

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 21: స్థానిక చినరావూరుతోటలోని 14వ వార్డులో సెయింట్ పాల్స్ లూథరన్ చర్చి ఆవరణలో బుధవారం రెండో విడత ఆరోగ్య సురక్షా శిబిరాన్ని మున్సిపల్ మేనేజర్ కిల్లాన అప్పలరాజు, హెల్త్‌ఆఫీసర్ డాక్టర్ కారుపూరు హెలెన్ నిర్మలల ఆధ్వర్యంలో నిర్వహించారు. శిబిరంలో డాక్టర్‌లు దివి కిషోర్ కుమార్, ముద్రకోల అనురాధ, ఎస్.సాంబశివరావులు పాల్గొని జనరల్ ఓపి 192 మంది, గైనకాలజీ ఓపీ 11 మంది, పీడియాట్రీషియన్ ఓపీ 35 మంది, ఆఫ్తొమెట్రీషియన్ ఓపీ 65మందిని పరీక్షించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ దాసరి వీర వసంతరావు, అసిస్టెంటు మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి, యుయల్‌బి ఆరోగ్య విస్తరణాధికారి అందె చంద్ర మౌళి, సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకాంత్, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అమ్మలాంటి మాతృభాషను మరవొద్దు

● స్వరలయ వేదిక వ్యవస్థాపకుడు సాయిలక్కరాజు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న సాయి

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 21: అమ్మలాంటి మాతృభాషను విద్యార్థులు మరిచిపోవద్దని స్వరలయ వేదిక వ్యవస్థాపకుడు సాయిలక్కరాజు చెప్పారు. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా ఆర్‌ఆర్ కాలనీలో గిరిజన బాలికల హాస్టల్‌లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. 9వ తరగతిలో 500లకు పైగా మార్కులు సాధించిన బాలికలకు నగదు బహుమతులు అందిస్తామని ప్రకటించారు. మాతృభాషలో ప్రావీణ్యం సాధిస్తేనే ఏ భాష అయిన తేలికగా నేర్చుకోవచ్చన్నారు. పదో తరగతి బాలికలకు పరీక్ష అట్టలు, పెన్నులు పంపిణీ చేశారు. స్వరలయ అధ్యక్షుడు డీవీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, లక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం



తెలుగుజాతికి నివాళులర్పిస్తున్న శ్రీరామమూర్తి, సుజాత, విద్యార్థులు

తెనాలి రూరల్, ఫిబ్రవరి 21: మండలంలోని కొలకలూరు శాఖా గ్రంథాలయంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాధికారిని కడియాల సుజాత అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్య అతిథిగా విశ్రాంత తెలుగు లెక్చరర్ వీబీ శ్రీరామమూర్తి పాల్గొని తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు తెలుగు పద్యాలపై పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు శ్రీరామమూర్తి చేతుల మీదుగా బహుమతులు అందించారు. మాతృభాష తల్లి వంటిదని పరభాష మోజులోపడి తెలుగును మరవవద్దని శ్రీరామమూర్తి విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో పలు స్కూల్స్‌కు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు, గ్రామ పెద్దలు, గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

10 ఇసుక రీచ్‌లకు అనుమతి

● పల్నాడులో ఆరు, గుంటూరులో నాలుగు

● మాన్యువల్‌గానే ఇసుక తీయాలని నిబంధన

● యంత్రాల వినియోగాన్ని అధికారులు అరికట్టేనా?



గుంటూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్ర జ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో కొత్తగా 10 ఇసుక రీచ్‌లకు పర్యావరణ అనుమతులు లభించాయి. ఇటీవల జరిగిన స్టేట్ ఎన్విరాన్ మెంట్ ఇంపాక్ట్ ఎసెస్‌మెంట్ అథారిటీ ఆంధ్రప్రదేశ్(ఎస్‌ఈఐఏఏ ఏపీ) సమావేశంలో అనుమ తులపై నిర్ణయాన్ని తీసుకున్నది. వాటిల్లో ప్రస్తుత పల్నాడు జిల్లాలో ఆరు, గుంటూరులో నాలుగు రీచ్ లున్నట్లు అధికారవర్గాలు తెలిపాయి. అయితే ఇసుక తవ్వకాలన్నీ మాన్యువల్ పద్ధతిలోనే జరపాలని షరతు పెట్టింది. అది కూడా ఏడాది మాత్రమే ఈ అనుమతులు అమలులో ఉంటాయని పేర్కొన్నది. పల్నాడులో ఈసీలను అక్కడి ఏడీ, గుంటూరులో డీడీ పేరు మీద మంజూరు చేసింది. ఈ నెల 7 నుంచే అనుమతులు జారీ అయ్యాయి. పల్నాడు జిల్లాలో అమరావతి మండలం దిడుగులో 4.930 హెక్టార్లు, పొందుగులలోని సర్వే నెంబరు.2లో 4.860 హెక్టార్లు, అచ్చంటపేట మండలంలోని డీ కోనూరులో సర్వే నెంబరు.331లో 3.930 హెక్టార్లు, అంబడిపూడిలోని సర్వే నెంబరు.1లో 4.830 హెక్టార్లు, అంబడిపూడి-1లో 4.830 హెక్టార్లు, అంబడిపూడి-2లో 4.840 హెక్టార్లలో ఇసుక తవ్వ కాలకు ఈసీ అనుమతులను మంజూరు చేసింది. ప్రస్తుత గుంటూరు జిల్లాలోని కొల్లిపర మండలం మున్నంగిలో సర్వే నెంబరు.661లో 4.886 హెక్టార్లు, తాడేపల్లి మండలం గుండిమెడలో 4.971 హెక్టార్లు, కొల్లిపర మండలం బొమ్మువానిపాలెంలో 4.840 హెక్టార్లు, బొమ్మువానిపాలెం-15లో సర్వే నెంబరు 128లో 4.80 హెక్టార్లలో అనుమతులు వచ్చాయి. ఆయా గ్రామాల్లోని సర్వే నెంబర్లలో మాత్రమే ఇసుకని మాన్యువల్ పద్ధతిలో తవ్వేందుకు గనుల శాఖ అనుమతులు మంజూరు చేయాలి. ఎన్‌జీటీ ఉత్తర్వులకు లోబడి ఈ అనుమతులు వచ్చినందున ఎలాంటి యంత్రా లను ఇసుక తవ్వకాలకు వినియోగించరాదు.

మాన్యువల్ పద్ధతిలో జరిగేనా...

మాన్యువల్ పద్ధతిలోనే ఇసుక తవ్వకాలు చేపట్టాలని ఎస్‌ఈఐఏఏ ఏపీ ఈసీలను మంజూరు చేస్తూ స్పష్టంగా పేర్కొన్నది. అయితే జిల్లాలో మాన్యువల్ పద్ధతికి స్వస్తి చెప్పి ఎన్నో ఏళ్లు అయింది. ఇప్పుడు అంతా యంత్రాల మ యమే. డ్రెడ్జర్లు, ఎక్స్‌కవేటర్లు పెట్టి ఇసుకని తోడి లారీలు, టిప్పర్లలోకి నింపుతున్నారు. మాన్యువల్ పద్ధతిలో అయితే ఒక్కో రీచ్‌లో రోజుకు కనీసం 20 లారీలు కూడా లోడింగ్ చేయలేరు. ఈ నేపథ్యంలో దొంగచాటుగా యంత్రా లు వినియోగిస్తూనే ఉంటారు. దీనిని మైనింగ్ అధికారులు ఏ విధంగా అరికడతారోచూడాలి.

దేశంలోనే ఆదర్శంగా నిలిచిన వలంటీర్ల వ్యవస్థ

● ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



కొల్లిపరలో వలంటీర్లకు పురస్కారం ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్, ప్రజాప్రతినిధులు, నాయకులు

కొల్లిపర, ఫిబ్రవరి 21: రాష్ట్రం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సచివాలయం, వలంటీర్ల వ్యవస్థను తీసుకురావటంతో దేశంలోనే ఆదర్శంగా నిలిచినట్లు ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రం కొల్లిపర పాలకేంద్రం కల్యాణ మండపంలో సేవామిత్ర, సేవారత్న, సేవావజ్ర పురస్కారాల ప్రదానం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమానికి ఎంపీడీవో విష్ణుప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా వలంటీర్లు ఉన్నారన్నారు. పేదవాడికి, మధ్యతరగతి వారికి సంక్షేమాన్ని ఎటువంటి అవినీతి లేకుండా వలంటీరు ద్వారా అందించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. సంక్షేమం అందుకున్న ప్రతి కుటుంబం ఎప్పుడు ఎన్నికలు వస్తాయా 175నియోజకవర్గాల్లో వైసీపీ అభ్యర్థులను గెలిపించటానికి సిద్ధంగా ఉన్నారన్నారు. వలంటీర్లు చిత్తశుద్ధితో పనిచేయడంతో ప్రభుత్వానికి తనకు మంచి పేరొచ్చిందన్నారు. అనంతరం మండలంలోని సచివాలయాల్లో పనిచేస్తున్న వలంటీర్లకు ఎమ్మెల్యే శివకుమార్, ఎంపీపీ పద్మావతి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌ల చేతుల మీదుగా పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పిల్లి రాధిక, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నల శివారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు బొల్లిముంత పోతురాజు, అద్దంకి బోసుబాబు, వైసీపీ మండల కన్వీనర్ అవుతు పోతిరెడ్డి, ఎంపీటీసీలు కేసన శ్రీలత, చిలుమూరు ఝాన్సీ, ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అన్నవరపు రమేష్, నాయకులు కల్లం వీరారెడ్డి, భీమవరపు సంజీవరెడ్డి, నెర్ల కుటుంబరెడ్డి, భీమవరపు శివకోటిరెడ్డి, బేతాళ భూషణం, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కాలేయ, జీర్ణకోశ వ్యాధులకు అత్యాధునిక వైద్యం

● గ్యాస్ట్రో ఎంటిరాలజిస్ట్ డాక్టర్ డీ.నాగేశ్వర్‌రెడ్డి

● సిద్దార్థ గ్యాస్ట్రోకేర్ హాస్పిటల్ ప్రారంభం

● డాక్టర్ ఆళ్ల సిద్దార్థ రెడ్డికి ప్రముఖుల అభినందన



ఎండోస్కోపీ యూనిట్‌లో నాగేశ్వర్‌రెడ్డి, సిద్దార్థ రెడ్డి, తదితరులు

గుంటూరు (మెడికల్) ఫిబ్రవరి 21: కాలేయ, జీర్ణకోశ వ్యాధులకు సబంధించి అత్యాధునిక పరికరాలతో గుంటూరులో పూర్తిస్థాయి వైద్యం అదించేందుకు గ్యాస్ట్రో కేర్ హాస్పిటల్ అందుబాట్లోకి రావడం సంతోషదాయకమని ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటిరాలజీ ఛైర్మన్ డాక్టర్ డీ.నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం గుంటూరువారితో మొదటి లైన్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన సిద్దార్థ గ్యాస్ట్రోకేర్ హాస్పిటల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేయగా, డాక్టర్ డీ.నాగేశ్వర్‌రెడ్డి హాస్పిటల్‌ను ప్రారంభిం చారు. ఈ సందర్భంగా నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ సిద్దార్థరెడ్డి ప్రతిభావంతుడైన వైద్యుడని, పేద, మధ్య తరగతి ప్రజలకు చక్కటి వైద్యసేవలు అందించాలని ఆకాంక్షించారు. హాస్పిటల్ అధినేత, మెడికల్ గ్యాస్ట్రో ఎంటిరాలజిస్ట్ డాక్టర్ ఆళ్ల సిద్దార్థ రెడ్డి మాట్లాడుతూ సిద్దార్థ గ్రాస్ట్రో కేర్ హాస్పిటల్‌లో అన్ని రకాల జీర్ణకోశ, కాలేయ వ్యాధులకు అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. అత్యవసర కేసులకు 24 గంటలూ వైద్య సేవలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో ఏపీ క్రెడాయ్ ఛైర్మన్ ఆళ్ల శివారెడ్డి, నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, డొక్కా మాణిక్య వరప్రసాద్, ఎమ్మెల్యేలు మద్దాళి గిరిధర్, మహమ్మద్ ముస్తఫా, మేకతోటి సుచరిత, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, మైనార్టీ వ్యవహారాల సలదారుడు ఎస్ఎం జియావుద్దీన్, వైసీపీ నేత నూరి ఫాతిమా, డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి, వైద్యులు పాల్గొని ఆళ్ల సిద్దార్థ రెడ్డికి అభినందనలు తెలిపారు.

ఓటరు దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలి

● కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

● రాజకీయపార్టీల ప్రతినిధులతో సమీక్ష



రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో పాల్గొన్న కలెక్టర్

గుంటూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్ని రకాల ఓటరు దరఖాస్తులను ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం క్షేత్రస్థాయిలో సక్రమంగా విచారించి ఈఆర్వోలు పరిష్కరిం చేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఓటరు జాబితాలు, దరఖాస్తుల పరిష్కారంపై రాజకీయ పార్టీల ప్రతినిధులు తెలిపిన అంశాలు, అభ్యంతరాలను ఈఆర్వోలు పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థుల అవగాహన కోసం ఎన్నికల సంఘం ఈవీఎంలు, వీవీప్యాట్‌లు పని చేసే విధానం, భద్రత ఫీచర్లపై అవగాహనకోసం రూపొందించిన మెటీరియల్‌ను రాజకీయపార్టీల ప్రతినిధులకు అందించటం జరుగుతుందన్నారు. వీటిని పూర్తిస్థాయిలో పరిశీలించాలన్నారు. సమావేశంలో డీఆర్‌వో పెద్ది రోజా, ఆమ్ ఆద్మీ పార్టీ, బీఎస్పీ, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్, టీడీపీల తరఫున ఆయా పార్టీల ప్రతినిధులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రవీంద్రరావు, లక్ష్మీకుమారి, జీఎంసీ ఏసీ రాజ్యలక్ష్మీ ఎన్నికల విభాగ అధికారులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్లలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు ..

జిల్లాలో పేదలందరికీ ఇళ్ళ పథకం స్థలాల రిజిస్ట్రేషన్లలో అలసత్వం వహించే సచివాలయ ఉద్యోగులు, పర్యవేక్షించే నోడల్ అధికార్లపై కఠినచర్యలు తీసుకుంటామని కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరం నుంచి ఆయన పేదలందరికీ ఇళ్ళ పథకం స్థలాల రిజిస్ట్రేషన్, జగనన్న పాలవెల్లువ, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, హౌసింగ్ తదితర అంశాలపై ప్రత్యేక అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవో లు, సచివాలయ ఉద్యోగులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ జీ.రాజకుమారి, జిల్లా రెవెన్యూ అధికారి పెద్ది రోజా పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో మెరుగైన విద్యా బోధన

● ఇంటర్మీడియెట్ రీజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫీసర్ జుబేర్

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 21: ప్రభుత్వ ఇంటర్ కళాశాలలో మెరుగైన విద్యాబోధన అందిస్తున్నామని ఇంటర్మీడియెట్ రీజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫీసర్ షేక్ జుబేర్ అన్నారు. మండల పరిధిలోని వెల్లలూరులో జిల్లా పరిషత్ హైస్కూల్ +2లో బుధవారం ఇంటర్‌మీడియేట్ ప్రథమ వార్షికోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన జుబేర్ మాట్లాడుతూ ఇంటర్‌మీడియేట్‌లో సీఈసీ, బైపీసీ గ్రూప్‌లు ఈ ఏడాది నిర్వహిస్తుండగా వచ్చే ఏడాది వెల్లలూరులో ఎంపీసీ గ్రూప్ ప్రవేశపెట్టేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. తల్లిదండ్రులు కూడా ప్రభుత్వ కళాశాలలపై ఉన్న అపోహలు విడనాడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులను చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె రమేష్, అధ్యాపకులు ఎంఎం ఖుద్దూస్, సి.సృజన, అరుణ్‌కుమార్, షేక్ షహనాజ్ బేగం తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'భువన విజయం'

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 21: విద్యార్థులు పదర్శించిన 'భువన విజయం' పద్య నాటిక వీక్షకులను ఆకట్టుకుంది. బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా స్థానిక బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై విద్యార్థులు నాటిక పదర్శన ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోషియేషన్ మహిళా విభాగం, గుళ్ళపల్లి సుబ్బారావు సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన నిర్వహించారు.



కొమలయ్య స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కొమలయ్యకు ఘన నివాళి

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 21: పేదల అభ్యున్నతి కోసం బొద్దు కొమలయ్య నిరంతరం పోరాడారన్ని సీపీఎం జిల్లా కమిటి సభ్యుడు దండా లక్ష్మీనారాయణ అన్నారు. మండల పరిధిలోని జూపూడిలో బుధవారం బొద్దు కొమలయ్య 20వ వర్ధంతి సభ జరిగింది. కొమలయ్య స్థూపం వద్ద సీపీఎం నాయకులు నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బొనిగల ప్రభుదాస్, ఎస్.రమేష్ బాబు, సీహెచ్ హనుమంతరావు, సుందరబాబు తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని మహిళ అదృశ్యం

గుంటూరు, ఫిబ్రవరి 21: జీజీహెచ్ నుంచి మతిస్థిమితం లేని మహిళ అదృశ్యమైంది. ఈ నెల 19న పెదపరిమి జగనన్న కాలనీకి చెందిన నూతలపాటి లక్ష్మి (42)కి మతిస్థిమితం సరిగా లేకపోవడంతో తండ్రి ఈ నెల 19న జీజీహెచ్‌కు తీసుకొచ్చారు. ఓపీ చీటీ రాయిస్తుండగా లక్ష్మీ ఎటో వెళ్లిపోయింది. తండ్రి ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు తాగునీటి సరఫరాలో అంతరాయం

తెనాలి మారీసుపేట, ఫిబ్రవరి 21: పట్టణంలో గురువారం తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మునిసిపల్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉండవల్లి ప్రకాశం బ్యారేజ్ వద్ద నుంచి పంపింగ్ చేసే 800 ఎమ్.ఎమ్. డయా పంపింగ్ మెయిన్ లైనుపై తెనాలి - మంగళగిరి రోడ్డు నుంచి వీఎస్‌ఆర్ అండ్ ఎన్వీఆర్ కాలేజ్ దాటిన తరువాత రోడ్డులో ఏర్పడిన లీకు మరమ్మతులు చేపట్టడం జరుగుతుందన్నారు. అందుకు గాను తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ప్రజలు సహకరించాలని కోరారు.

రక్తదాన శిబిరం

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 21: స్థానిక రామలింగేశ్వర పేటలోని మున్సిపల్ ఆడిటోరియంలో బుధవారం హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ముంబాయి) కోస్తాంధ్ర అధ్యక్షుడు పల్నాటి నాగరాజు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ప్రజా రక్షణ ముఖ్యమని గతంలో రక్త నిల్వలు లేక మా అమ్మ కూడా చనిపోయారని, అలాగే ఎవరైతే డెలివరీ టైంలో రక్తంలేక ఇబ్బంది పడుతున్నారో, అలాంటి గర్భిణుల కోసం రక్తదానం చేస్తున్నామని అన్నారు. రక్తదానం చేయడం వల్ల వారి ప్రాణాలు నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 76సార్లు రక్తదానం చేసిన సునీల్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఏవో చిట్టిబాబు, వైద్య శిబ్బంది రమాదేవి, సుజాత, శ్రీను, ప్రిన్సిపాల్ మాల్యాద్రి, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.



నారాకోడూరులో నిర్మాణంలో ఉన్న భారీ విద్యుత్ ప్రభ

విద్యుత్ ప్రభల నిర్మాణం ప్రారంభం

చేబ్రోలు, ఫిబ్రవరి 21: క్వారీ బాలకోటేశ్వరస్వామి ఆలయం వద్ద మహాశివరాత్రి పర్వదినానికి నిర్వహించే ఉత్సవాలకు భక్తులు ప్రభల నిర్మాణాన్ని ప్రారంభించారు. శివరాత్రి పర్వదినం అంటేనే కార్వీ బాలకోటేశ్వరస్వామి ఆలయానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భారీ విద్యుత్ ప్రభలు నిర్మించి తీసుకువస్తారు. బాలకోటేశ్వరస్వామి ఆలయానికి సమీపంలోని నారాకోడూరు, చేబ్రోలు, వేజండ్ల, సుద్ధపల్లి, గొడవర్రు, గుండవరం వంటి గ్రామాల నుంచి భారీ విద్యుత్ ప్రభలను నిర్మించి భక్తులు కోలాహల వాతావరణం మధ్య ఆలయానికి ఊరేగింపుగా తీసుకురావటం అనవాయితీ. త్వరలోనే జరగనున్న ఈ ప్రభల ఉత్సవానికి ఆయా గ్రామాల ప్రజలు విస్తృత ఏర్పాట్లను ప్రారంభించారు. అందులో భాగంగా నారాకోడూరులో భక్తులు ప్రత్యేక పూజలుచేసి ప్రభల నిర్మాణానికి భక్తి శ్రద్ధలతో ప్రారంభించారు.

అరవింద ఆశ్రమ స్థాపకులు శ్రీమాత జన్మదిన వేడుకలు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 21: నాజరుపేటలోని అరవింద ఆశ్రమ స్థాపకులు శ్రీమాత జన్మదిన వేడుకలు బుధవారం అరవింద విద్యాకేంద్రంలో నిర్వహించారు. సామూహిక ధ్యానం, మార్చ్‌ఫాస్ట్ కార్యక్రమాలు జరిపారు. అరవింద ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి మోహన్‌బాబు పతాకం ఆవిష్కరించారు. విశ్రాంత ప్రిన్సిపల్ కె.రామరాజు, దివ్యదీపిక ఆధ్యాత్మిక సంచికను ఆవిష్కరించారు. డైరెక్టర్ సంపూర్ణ, బాషా, నిర్మలారమేష్, నాగమల్లేశ్వరి, పద్మశ్రీ, లక్ష్మి, నిర్మలకుమారి ప్రసంగించారు.



రాముల వారి చిత్రపటాన్ని అశ్వరథంపై ఊరేగిస్తున్న భక్తులు

వైభవంగా రాములోరి విగ్రహ ప్రతిష్ఠ

చేబ్రోలు, ఫిబ్రవరి 21: మండల కేంద్రమైన చేబ్రోలులోని రజక సంఘ రామాలయ పునః ప్రారంభ మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం శ్రీరామచంద్రుడి చిత్రపటాన్ని అశ్వరథంపై ప్రతిష్ఠించి చేబ్రోలు వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులకు పోలీసుల నోటీసులు



కాంగ్రెస్ కన్వీనర్ డాక్టర్ సాంబశివుడుకు నోటీసు అందజేస్తున్న వన్‌టౌన్ సీఐ దశరథ రామారావు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 21: సచివాలయ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులను పోలీసులు హౌస్ అరెస్టు చేసేందుకు చర్యలు చేపట్టారు. గురువారం సచివాలయం ముట్టడి నిర్వహించనున్న నేపథ్యంలో తెనాలి నియోజకవర్గ కాంగ్రెస్ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడుకు వన్ టౌన్ సీఐ దశరథ రామారావు బుధవారం నోటీసు అందజేశారు. సచివాలయం ముట్టడికి అనుమతి లేనందున సదరు కార్యక్రమానికి హాజరు కావద్దంటూ ఆయనతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులకు నోటీసులు ఇచ్చారు. డాక్టర్ సాంబశివుడు మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో వాక్ స్వాతంత్ర్యం లేకుండా పోయిందని, అక్రమాలు, అవినీతికి అడ్డాగా మారిన ప్రభుత్వానికి పోలీసులు వత్తాసు పలకడం శోచనీయమన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

నేడు కోల్డ్ స్టోరేజీ అగ్నిబాధిత రైతుల ధర్నా

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 21: దుగ్గిరాల శుభమ్ కోల్డ్ స్టోరేజీ బాధిత రైతులు గురువారం ధర్నా నిర్వహిస్తున్నామని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ములకా శివసాంబిరెడ్డి తెలిపారు. రైతులకు చెందిన పసుపు అగ్ని ప్రమాదంలో కాలిపోయి నెల రోజులు అవుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవడం శోచనీయమని ధర్నాలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.



పార్థసారథి దంపతులను సత్కరిస్తున్న అర్చకులు

పంచముఖ ఆంజనేయ స్వామికి తిరుచ్చి వాహన సేవ

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 21: షరాఫ్ బజారులోని పంచముఖ ఆంజనేయ స్వామికి బుధవారం తిరుచ్చి వాహన సేవ నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మారిషస్ దేశ సంస్కృతిక సలహాదారు బృందావనం పార్థసారథి దంపతులు స్వామి వారి పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు, ఈవో శ్రీనివాసరెడ్డి ఆ దంపతులను ఘనంగా సన్మానించారు. నిఖిల్ చాండిల్య, శ్రీనివాసమూర్తి, అనురాధ, కిరణ్‌కుమార్, వెంకటేశ్వరరావు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.